Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 95 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 15 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## విశాఖ గూగుల్ ఏఐ హబ్.. భారత డిజిటల్ ఆర్ధిక వ్యవస్థకు బలం : ప్రధాని మోదీ




**అమరావతి, (రాజధాని వార్తలు):** డైనమిక్ సిటీ విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్‌ను లాంఛ్ చేయడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అన్ని కోణాల నుంచి వచ్చిన ఈ పెట్టుబడిలో గెగావాట్ – స్కేల్ డేటా సెంటర్‌ల రూపంలో మౌలిక సదుపాయాలు వికసిత్ భారత్‌కి దోహదం చేస్తాయని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ట్వీట్ చేశారు. సాంకేతికతను ప్రజలందరికీ అందుబాటులోకి తేవడంలో విశాఖపట్నంలోని గూగుల్ ఏఐ హబ్ చాలా శక్తివంతంగా పనిచేస్తోందని అభివర్ణించారు. గూగుల్ ముందడుగు అందరికీ ఏఐ అనే నినాదానికి ఊతం ఇస్తోందని ఉద్ఘాటించారు. భారత పౌరులకు కటిగ్ ఎడ్జి టూల్స్ అందించడంలో ఎంతో ఉపకరిస్తోందని వివరించారు. మన డిజిటల్ ఆర్థిక వ్యవస్థకి సహకరించడంతోపాటు సాంకేతికతలో ప్రపంచంలో భారత్‌ని బలంగా నిలుపుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

**ఏఐ హబ్ ఒక ల్యాండ్ మార్క్: గూగుల్ సీఈవో సుందర్ పిచ్చాయ్**

మరోవైపు.. ఏపీలో ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుపై అంతర్జాతీయంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో గూగుల్ అండ్ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ ట్వీట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడటం ఎంతో గొప్పగా ఉందని చెప్పుకొచ్చారు. మొట్టమొదటి గూగుల్ ఏఐ హబ్‌ని విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా తమ ప్రణాళికలు తెలియజేశానని పేర్కొన్నారు సుందర్ పిచాయ్. ఏఐ హబ్ ఈ రంగంలో ఒక ల్యాండ్ మార్క్ అభివృద్ధిగా మారుతోందని ఉద్ఘాటించారు. ఈ హబ్‌లో గెగావాట్ – స్కేల్ కంప్యూట్ కెపాసిటీ, నూతన అంతర్జాతీయ సబ్ సీ గేట్ వే ఉన్నాయని వివరించారు. అతిపెద్ద విద్యుత్ ఆధారిత మౌలిక సదుపాయలు ఉండనున్నాయని వెల్లడించారు. తమ మెరుగైన సాంకేతికతను భారతీయ పెట్టుబడిదారులకు, ప్రజలకు అందించే కార్యక్రమం ఇదని అభివర్ణించారు. దేశం మొత్తం ఏఐని మరింత వేగవంతం చేయడంలో.. మరిన్ని పరిశోధనలకు ఇది ఆస్కారం ఇస్తోందని గూగుల్ సీఈవో సుందర్ పిచ్చాయ్ పేర్కొన్నారు.

## రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం : హోంమంత్రి అనిత

**అమరావతి, (రాజధాని వార్తలు):** గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం శుభ పరిణామమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యా యంగా అభివర్ణిం చారు. గూగుల్ డేటా సెంటర్ రాకతో ఉత్త రాంధ్ర ప్రపంచ పటంలో నిలవనుందన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో 1.88 లక్షల మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. గతంలో సీఎం చద్ర బాబు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ అభివృద్ధి చేశారని.. ప్రస్తుతం విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నారని అన్నారు. ఆనాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చారని.. ప్రస్తుతం విశాఖకు గూగుల్‌ను తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. సాంకేతికతతో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. ఉత్తరాంధ్ర వాసిగా ఎంతో సంతోషపడుతున్నానని అన్నారు మంత్రి. విశాఖను ఐటీ హబ్‌గా మార్చుతున్న సీఎం చంద్రబాబుకు, ఐటీ మంత్రి లోకేష్‌కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు విశేష కృషి చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు విశాఖ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు హోంమంత్రి అనిత.




**గూగుల్ రాక ఏపీలో గేమ్ ఛేంజర్ : యార్లగడ్డ**

టెక్ ప్రపంచంలో ఏపీకి చారిత్రాత్మక రోజు అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు అన్నారు. గూగుల్ క్లౌడ్‌తో ఏపీ ప్రభుత్వం కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని తెలి పారు. గూగుల్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగు పెట్టిందని..డిజిటల్ ఇన్నో వేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కొత్త అధ్యాయమని పేర్కొన్నారు. గూగుల్ రావడం ఆంధ్రప్రదేశ్‌లో గేమ్ చేంజర్ కాబోతుందని అన్నారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ వచ్చిన తరువాత అనేక ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు క్యూ కట్టాయన్నారు. హైదరాబాద్‌ను స్వరూపం మార్చివేసిందని గుర్తు చేశారు. అదేవిధంగా గూగుల్ రాకతో ఏపీలో కూడా ఐటీ రంగం మరింత ఊపు అందుకోనుందని యార్లగడ్డ వెంకటరావు ధీమా వ్యక్తం చేశారు.

## విశాఖ ఏఐ రాజధానిగా మారుతుంది : మంత్రి సత్యప్రసాద్



**కర్నూలు, (రాజధాని వార్తలు):** విశాఖపట్నానికి గూగుల్ ఏఐ హబ్ రావడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచుతుందని ఏపీ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్య ప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖపట్నానికి రావడం నవ్యాంధ్రప్రదేశ్‌కు శుభపరిణామమని అభివర్ణించారు. మంగళవారం కర్నూలు జిల్లాలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలని తీసుకువచ్చి హైదరాబాద్‌ని అభివృద్ధి చేశారని.. ఇవాళ విశాఖకు గూగుల్‌ని తీసుకు వచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చుతున్నారని ప్రశంసించారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం, సమర్థవం తమైన నాయకత్వం ఉండటంతో ఏపీకి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని వివరించారు మంత్రి అనగాని సత్యప్రసాద్. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాత్రింబవళ్లు కష్టపడుతూ వివిధ కంపెనీల ప్రతినిధులతో గంటల కొద్దీ చర్చలు జరిపి ఏపీకి పరిశ్రమలను తీసుకొస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 16 నెలల్లో ఏపీకి రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు వచ్చాయని వెల్లడించారు. గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందుతాయని తెలిపారు. సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ నగరం.. నేడు ఏఐ, డిజిటల్ సిటీకి రాజధానిగా మారతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## పవన్ కల్యాణ్ చొరవ.. అపరిష్కృత సమస్య పరిష్కారం

**అమరావతి, (రాజధాని వార్తలు):** కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. సెజ్ పరిధిలోని 2,180 ఎకరాల భూములకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీలను మినహాయించి తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసేలా నిర్ణయం తీసుకుంది కూటమి ప్రభుత్వం. పవన్ కల్యాణ్ చొరవ తీసుకొని ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించారు. దీంతో కాకినాడ తీరంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల పరిధిలో సుమారు 1,551 మంది రైతులకు మేలు జరగనుంది. అయితే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఈ విషయంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చర్చించారు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ రుసుములు, స్టాంప్ డ్యూటీ మినహాయింపునిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు సీఎం చంద్రబాబు.

## ప్రధాని మద్దతుతోనే సాధ్యం.. గూగుల్‌తో ఒప్పందంపై సీఎం



**న్యూఢిల్లీ :** గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం నాడు విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ఢిల్లీలో జరిగిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మద్దతుతో ఇది సాధ్యం అయ్యిందన్నారు. తాను చూసిన ప్రధాన మంత్రులలో మోదీ ప్రత్యేకమన్నారు. విజినరీ, ఆలోచన తీరు, నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ఎవరూ అందుకోలేరని కొనియాడారు. ప్రధాని సారథ్యంలో 2047 కంటే ముందుగానే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్, కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారం అందించారన్నారు. విశాఖపట్నానికి గూగుల్ రావడంతో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు. గూగుల్ డాటా సెంటర్‌కు అన్ని విధాల ఏపీ ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అనేక మార్పులు వస్తాయని...పలు కంపెనీలు గూగుల్ బాటలో పయనించే అవకాశం ఉందన్నారు. 'don't work hard, work smart' అని అన్నారు సీఎం. నైతిక విలువలతో కూడిన ఏఐ టెక్నాలజీ అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## కదులుతున్న బస్సులో మంటలు.. 15 మంది సజీవ దహనం

**జైసల్మేర్:** రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో మంగళవారంనాడు ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. తైయాట్ ప్రాంతంలోని మిలటరీ స్టేషన్ సమీపంలో కదుపుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి 15 మంది సజీవ దహనమయ్యారు. మరో 25 మంది గాయపడ్డారు. బస్సులోంచి దట్టమైన పొగలు రావడంతో డ్రైవరు వెంటనే బస్సులు నిలిపి వేశారు. నేషనల్ హైవేపై బస్సు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకోవడంతో కిలోమీటర్ల వరకూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని అర్మీ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగి చుట్టుపక్కలకు మంటలు విస్తరించకుండా వెంటనే అదుపులోనికి తెచ్చాయి. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిప్రమాదానికి కారణం ఏమిటనేది వెంటనే తెలియలేదు.



## విశాఖ ఏఐ హబ్‌పై 5 ఏళ్లలో $15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

**- ఏఐ హబ్ ద్వారా భారత్‌ను అంతర్జాతీయ నెట్ వర్క్‌తో అనుసంధానిస్తాం**

**- విశాఖ ఏఐ హబ్ ఏర్పాటుకు ఢిల్లీలో గూగుల్ చరిత్రాత్మక ఒప్పందం**





**న్యూఢిల్లీ :** భారత ప్రభుత్వ సహకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మద్దతుతో విశాఖపట్నంలో నూతనంగా 1 గిగావాట్ సామర్థ్యం గల ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించేందుకు మాకు ఆనందంగా ఉంది, ఇది అమెరికా తర్వాత ప్రపంచంలో గూగుల్ నిర్మించబోయే అతి పెద్ద ఏఐ హబ్. వచ్చే 5 సంవత్సరాల్లో విశాఖ ఏఐ హబ్ నిర్మాణానికి $15 బిలియన్ అమెరికన్ డాలర్లు (రూ.1,33,000 కోట్లు) పెట్టుబడి పెట్టబోతున్నామని గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సీఈవో థామస్ కురియన్ ప్రకటించారు. ఢిల్లీలోని తాజ్ మాన్ సింగ్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ ప్రతినిధుల నడుమ చరిత్రాత్మక అవగాహన ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వనీ వైష్టవ్, గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సీఈవో థామస్ కురియన్, బికాష్ కొలే (వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), కరణ్ బజ్వా (ప్రెసిడెంట్, ఏషియా పసిఫిక్ గూగుల్ క్లౌడ్) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో థామస్ కురియన్ మాట్లాడుతూ... విశాఖలో 1 గిగావాట్ సామర్థ్యంతో తాము ప్రారంభించే ఏఐ హబ్‌ను... భవిష్యత్తులో మరిన్ని గిగావాట్లకు విస్తరిస్తాం. ఇది ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలలో ఉన్న ఏఐ సెంటర్స్ నెట్‌వర్క్‌లో భాగంగా ఉంటుంది. భారతదేశంలో మేం నిర్మించే అతి పెద్ద AI కేంద్రం ఇదే. దీనిద్వారా విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయి కనెక్టివిటీ హబ్‌గా అభివృద్ధి చేయబోతున్నాం. ఇందుకోసం విశాఖపట్నంలో సముద్రగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాం. ఈ సబ్ సీ కేబుల్ నెట్‌వర్క్‌ను అంతర్జాతీయ నెట్‌వర్క్‌కు కనెక్ట్ చేసి, దేశంలోని వివిధ ప్రాంతాల్లోని డిజిటల్ ఆధారిత వ్యవస్థలతో అనుసంధానిస్తాం. AI టెక్నాలజీతో పాటుగా డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కూడా అందించబోతున్నాం. AI హబ్‌లో పూర్తి సాంకేతిక పరిష్కారాలు అందుబాటులో ఉంటాయి. దీనిలో TPUs (టెన్సర్స్ ప్రాసెసింగ్ యూనిట్లను) వాడుతాం, ఇవి AI ప్రాసెసింగ్‌కు బలం చేకూరుస్తాయి. ఇవి రెండింతల పవర్–ఎఫిషియన్స్‌తో పనిచేస్తాయి. స్థానికంగా డేటాను స్టోర్ చేసి సావరిన్ ఏఐ అవసరాలు తీర్చేలా ఏఐ హబ్ పనిచేస్తుంది. జెమిని, Imagine VO, ఇంకా మా AI మోడళ్ళన్నింటితోపాటు యాప్ డెవలప్ మెంట్ కోసం అవసరమైన ఏఐ ప్లాట్ ఫామ్ లను హబ్ అందిస్తుంది. దీనిద్వారా ఉద్యోగులు, వ్యాపారులు, యువత అందరి అవసరాలకు AI ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అందుబాటులోకి తీసుకు రాగలమని భావిస్తున్నాం. ఏఐ హబ్‌లోని ఏఐ టెక్నాలజీ ద్వారా మా గూగుల్ ఐకానిక్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, గూగుల్ సెర్చ్, యూట్యూబ్, జీ మెయిల్, యాడ్స్, ఇతర సేవలు భారతదేశం నుంచే ప్రపంచానికి అందించే అవకాశముంది. భారతదేశానికి ఉత్తమ AI టెక్నాలజీని అందించడమే మా లక్ష్యం. వివిధ కంపెనీలకు సాంకేతిక సహకారాన్ని అందించడంతోపాటు ఇండియాలో నైపుణ్య శిక్షణ అందించి ఇక్కడ యువతను ప్రపంచస్థాయి ఏఐ నిపుణులుగా తీర్చిదిద్దుతాం. భారత రెగ్యులేటరీ అవసరాలను తీర్చేలా టాలెంట్ పైప్‌లైన్ రూపొందిస్తాం. ఈ హబ్ ద్వారా భారతదేశానికి మాత్రమే కాకుండా ఆసియాతోపాటు ఇతర ప్రపంచ దేశాలకు సేవలు అందించేందుకు కనెక్టివిటీ నెట్‌వర్క్ ఏర్పరచడమే మా లక్ష్యం. గూగుల్ చాలాకాలంగా భారత్ లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

భారత్‌లోని ఐదు కేంద్రాల్లో ప్రస్తుతం 14 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఐదేళ్ల క్రితం మేం భారత్‌లో గూగుల్ క్లౌడ్ సొల్యూషన్స్ సేవలు ప్రారంభించాం. ఇప్పుడు న్యూఢిల్లీ, ముంబయిలలో ఈ సేవలను అందిస్తున్నాం. గూగుల్ డివైస్‌లను భారత్‌లో తయారు చేస్తున్నాం. ఈ సందర్భం గా భారత ప్రభుత్వానికి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాకు సహకారం అందిస్తున్న అందిరికీ ధన్యవాదాలు. ఇది గూగుల్‌కు ఎంతో విశిష్టమైన రోజు. గూగుల్ తరపున భారత్ ప్రజలకు, ఈ సభలో ఉన్న ప్రతి ఒక్కరికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ఒప్పందం 2047 వికసిత్ భారత్‌లో మా భాగస్వామ్యంగా భావించాలని థామస్ కురియన్ పేర్కొన్నారు.

# గిరిజన కార్మికుల ఆకలి బాధలు ముగ్గురు మంత్రులకు కనిపించడం లేదా!

**- గిరిజన హాస్టల్ కార్మికుల నోటికాడి బువ్వ గుంజుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ - గిరిజన హాస్టల్స్ మూసివేసే పరిస్థితి వచ్చిన స్పందించని ప్రభుత్వం - డైలీ వేజ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు - ఐ టి డి ఏ ముందు గిరిజన కార్మికుల 72 గంటల మహాధర్నా - భారీగా తరలి వచ్చిన డైలీ ఇమేజ్ అవుట్సోర్సింగ్ కార్మికులు - గిరిజన కార్మికులకు ప్రజాసంఘాల నుండి పెరుగుతున్న మద్దతు**

**భద్రాచలం, (రాజధాని వార్తలు):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వున్న ముగ్గురు మంత్రులకు గిరిజన విద్యార్థులకు వండి పెట్టే హాస్టల్ కార్మికుల ఆకలి బాధలు కనిపించడం లేదని, గిరిజన కార్మికుల నోటికాడి బువ్వను కాంగ్రెస్ ప్రభుత్వం గుంజుకుంటుందని ఓట్లేసి గెలిపించిన పాపానికి జీతాలు తగ్గిస్తారా అని డైలీ వేజ్ మరియు ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు ప్రశ్నించారు. డైలివేజ్ వర్కర్లకు టైమ్ స్కేల్ ఇవ్వాలని అప్పటివరకు కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు జీవో 60 ప్రకారం 15600/-ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో పాటు ఆరోగ్య భీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ గత 32 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వ గిరిజన హాస్టల్ డైలీ వేజ్ కార్మికులు సోమవారం భద్రాచలం ఐటిడిఏ ముందు 72 గంటల మహాధర్నాను ప్రారంభించారు. ఉదయం నుండి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వందల సంఖ్యలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని విరమించేది లేదని ఐ టి డి ఏ ఎదుచబైటాయించారు. స్థానిక గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రితో మాట్లాడి గిరిజన కార్మికులకు పాత జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. 72 గంటల ధర్నా సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ గిరిజన కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని చదువుకోవాల్సిన విద్యార్థులు పోయి దగ్గర మగ్గిపోతుంటే విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు క్లీనింగ్ పనులు చేస్తున్నారని ఈ దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని అన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒక్కొక్క కార్మికుడు నెలకు 16 వేల రూపాయల నష్టపోయాడని అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం 15,600 చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న ఐటిడిఏ పరిధిలో ఒక్కో ఐటిడిఎ కి ఒక్కో విధానాన్ని కొనసాగిస్తూ కార్మికుల పొట్టను కొట్టడం సరైనది కాదని మధు ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు గాని ప్రభుత్వ ఉద్యోగులకు గాని జీతాలు తగ్గిస్తే పనిచేస్తారా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. లక్షల్లో జీతాలు తీసుకుంటున్న ప్రజా ప్రతినిధులకు కార్మికుల ఆకలి బాధలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

**జీతాలు తగ్గిస్తే గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు పని చేస్తారా? : కారం పుల్లయ్య ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి**

గిరిజన కార్మికులు చేస్తున్న 72 గంటల మహా ధర్నాకు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య సందర్శించి తమ పూర్తి మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఒక నెల జీతం తగ్గిస్తే విధులకు



హాజరవుతారా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గిరిజనులు ఓట్లు వేసి గెలిపించింది జీతాలు తగ్గించడానికి అని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విధానాల వల్ల గిరిజన విద్యార్థిని విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హాస్టల్లో మూసివేసే పరిస్థితికి కారణం ప్రభుత్వమేనని ప్రభుత్వ విధానాల తోనే ఈరోజు గిరిజన హాస్టల్లో మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యను పరిష్కరించకపోతే గిరిజన కార్మికుల అండగా గిరి సంగంవారి సమస్యను పరిష్కరించకపోతే గిరిజన కార్మికుల అండగా ఆదివాసి తెలంగాణ గిరిజన సంఘం ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

**ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం : కొలగాని బ్రహ్మాచారి సిఐటియు జిల్లా అధ్యక్షులు**

ఇన్ని రోజులుగా గిరిజన కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం గానీ ప్రభుత్వ పెద్దలు గానీ స్పందించకపోవడం దుర్మార్గమని స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ముఖ్యమంత్రితో చర్చించి గిరిజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కొలగని బ్రహ్మాచారి స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలకు మంత్రులకు ఎన్నిసార్లు దండాలు పెట్టి దరఖాస్తులు ఇచ్చిన కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని గతిలేని పరిస్థితిలోనే 72 గంటల మహా ధర్నాకు కార్మికులు దిగారని ఇకనైనా ప్రభుత్వ పెద్దలు స్పందించకపోతే జరిగే పరిణామాలకు వారే బాధ్యత వహించాలని బ్రహ్మాచారి హెచ్చరించారు. హాస్టల్ డైలీ బీజ్ వర్కర్ల పోరాటానికి వివిధ ప్రజాసంఘాల నుండి మద్దతు రోజురోజుకు పెరుగుతుందని అన్నారు.

72 గంటల్లో ప్రభుత్వం స్పందించి హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో కలిసొచ్చే సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బ్రహ్మాచారి హెచ్చరించారు. ఈ 72 గంటల మహా ధర్నాలో డైలీ వేజ్ కార్మికుల జిల్లా కార్యదర్శి హీరాలాల్ నాగేశ్వరరావు మంగమ్మ మంగీలాల్ స్వామి జలంధర్ తిరుపతమ్మ ఈశ్వర్ రామ కల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం స్వామి ఎస్ఎఫ్ఐ భద్రాచలం డివిజన్ నాయకులు రవి గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కొంజా శ్రీను సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు భూపేందర్ నాయకులు సున్నం ప్రవీణ్ డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సతీష్ బాబు తో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు డైలీ వేస్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా జోరు వానలో సైతం ఐటిడి ఆవరణలోనే వంటావార్పును నిర్వహించి అక్కడే భోజనాలు చేసి 72 గంటల ధర్నాను కార్మికులు కొనసాగిస్తున్నారు

# చర్ల నుండి భద్రాచలం వచ్చే రహదారులు ఆగమై అయిపోతున్న పట్టించుకునే నాధుడు

**రోడ్లు గుంతలు పడి వాహన దారులుఅనేక ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని అధికారులు : సొసైటీ పేరుతో గిరిజనులను మోసం చేస్తున్న దళారులు**





**చర్ల, (రాజధాని వార్తలు):** చర్ల మండలంలో జరిగే ఇసుక వ్యాపార లావాదేవీలు ఆదివాసుల చేతులలో లేవు ఎన్ని లారీలు వెళుతున్నాయి వస్తున్నాయి పాసింగ్ లారీలు ఎన్ని ఇసుక డంపింగ్ ఎంత మెయింటెనెన్స్ ఖర్చులు ఎంత అన్న విషయం నిజంగా ఆదివాసి సొసైటీల అధ్యక్షులు సభ్యులకు తెలుసా ప్రైవేటు రైసింగ్ కాంట్రాక్టర్ల చేతిలో ఇసుక దోపిడీ జరుగుతుందని రోడ్లు పాడైపోతున్నాయని ఇసుక మోసపూరిత వ్యాపారం చేసే వారి పేర్లతో సైతం బయటపెట్టినా – పత్రికాముఖంగా ప్రచురించిన ప్రముఖ రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్న అధికారులు తీసుకునే చర్యలు ఏవి పేర్లతో సహా ఇసుక రైజింగ్ కాంట్రాక్టర్ల పేరును బయట పెట్టిన (సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ) కెచ్చేలరంగారెడ్డి, సి బి సి ఐ డితో విచారణ జరిపించాలన్న డిమాండ్. భద్రాచలం నియోజకవర్గం ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక లారీల రద్దీతో ఆదివాసి పల్లెలు ప్రజల ప్రయాణం అగమ్య గోచరం ట్రాఫిక్ జామ్ సమస్యతో ఇసుక లారీల వలన జరిగే ప్రమాదాలకు బాధ్యులు ఎవరు జవాబు దారితనం ఉందా? లేదా సామాన్యులు ప్రయాణించే రోడ్లలో ద్విచక్ర వాహనదారులకు భద్రత లేదు ప్రభుత్వం నడిపించే



ఆర్టీసీ బస్సులు సైతం ఇసుక వాహనాల ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి వృద్ధులు పిల్లలు మహిళలు అనారోగ్యం బారిన పడిన వారు ప్రయాణం చేయాలంటే నాన్న అవస్థలు పడుతున్నారు. అంబులెన్స్‌కు కూడా దారి ఉండదు ప్రాణాలు పోతే పరిస్థితి ఏంటి పాదచారులు గొర్రెల కాపరులు పశువుల కాపరులకు రోడ్లమీద తిరిగే పశువులకు కూడా భద్రత లేదు భద్రాచలం టు వాజేడు దాకా రోడ్డు అంతా గుంతలమయం. ఇప్పుడు ఎటపాక టు ఎక్స్ రోడ్ మారాయిగూడెం వయా ములకపాడు రోడ్డు నాశనం అవ్వడానికి సిద్ధంగా ఉంది.

# భద్రాచలంలో పలు అభివృద్ధి పనులలో భాగంగా సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం మండలంలో ఇండస్ట్రియల్ ఏరియా, అశోక్ నగర్ కొత్త కాలనీ, రాజపేట కాలనీ, శాంతినగర్ కాలనీ, ఎమ్మార్వో ఆఫీస్, పోలీస్ స్టేషన్ నందు పలు అభివృద్ధి పనుల్లో భాగంగా సిసి రోడ్లకు శంకుస్థాపనలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సిసి రోడ్లకు శంకుస్థాపనలు చేయడం జరిగింది. త్వరలోనే రామాలయం టెంపుల్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుంది. లక్షల రూపాయలు నిధులను తీసుకు వచ్చి భద్రాచలం అభివృద్ధి చేస్తున్నందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శంకుస్థాపన చేసిన ప్రతి ఒక్క కాలనీలోని ప్రజలు



అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, ఇంచార్జ్ ఎండి నవాబు తదితరులు పాల్గొన్నారు.

# ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయాలను సందర్శించిన ఐటిడిఎ పి ఓ రాహుల్





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పనిచేసే సిబ్బంది యొక్క పూర్తిస్థాయి రికార్డులు సక్రమంగా నిర్వహించి చాలా జాగ్రత్తగా భద్రపరిచే విధంగా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం నాడు ఐటీడీఏ కార్యాలయంలోని ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయమును ఆయన సందర్శించారు. డిడి ట్రైబల్ వెల్ఫేర్ సెక్షన్‌లో పూర్తిస్థాయి రికార్డులను, సేవా పుస్తకములను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సేవా పుస్తకముల నిర్వహణ తీరును డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్ మరియు సిబ్బందిని అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్ఎం మరియు వార్డెన్ ఉపాధ్యాయులు సిబ్బందికి సంబంధించిన సర్వీస్ బుక్కులు పూర్తి స్థాయిలో పరిశీలించడం జరిగిందని, సర్వీస్ బుక్కుల నిర్వహణలో సిబ్బంది ఎవరైనా క్రమశిక్షణ రాహిత్యంగా ప్రవర్తించినట్లు నా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిబ్బందికి హెచ్చరించారు. సర్వీస్ బుక్కులు నిర్వహణ విషయంలో ఆ సెక్షన్లకు సంబంధించిన సిబ్బంది చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, పర్యవేక్షకురాలు ప్రమీల బాయ్, సిబ్బంది రమణమూర్తి, రామకృష్ణారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సత్య కళాశాల ఎన్ సి సి బాలుర విభాగం ఎంపిక





**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక తోటపాలెం పరిధిలో గల సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల బాలుర ఎన్‌సిసి విభాగం ఎంపిక ప్రక్రియను అయోధ్య మైదానంలో 13 బాయ్స్ బెటాలియన్, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నీరజ్ కుమార్, సుబేదార్ దేవేందర్ సింగ్, హవల్దార్ ఆనంద్ సింగ్, హవల్దార్ రామ్ ప్రసాద్, హవల్దార్ కులదీప్ కాల, జిసిఎల్ దివ్య దుర్గా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిక ప్రక్రియలో అభ్యర్థులను 1600 మీటర్ల పరుగు, సిటప్‌లు, పుష్ అప్‌లు, 100 మీటర్ల స్ప్రింట్, ఎత్తు, బరువు, కంటి చూపు వంటివి పరీక్షించి వ్యక్తిగత ఇంటర్వ్యూ ను నిర్వహించారు. మొత్తం 100 మంది సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. మజ్జి శశిభూషణ రావు, ఎన్‌సిసి అధికారులు, లెఫ్టినెంట్ ఎం. ఉదయ్ కిరణ్, యన్ సి సి క్యాడట్స్ పాల్గొన్నారు. ఈ ఎంపిక శిబిరం ద్వారా విద్యార్థుల శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు.

# చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు, 7.50 లక్షలు జరిమానా విధిస్తూ స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.విజయ రాజ్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు కార్యాలయ సిబ్బంది అందించిన వివరాలు ప్రకారం, గజపతినగరానికి చెందిన ఇప్పిన గిరి శ్రీను అనే వ్యక్తికి పురిటిపెంట గ్రామానికి చెందిన కంది వెంకటరమణ అప్పు నిమిత్తం ఐదు లక్షల రూపాయలు చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు బౌన్స్ కావడంతో ఇప్పిన గిరి శ్రీను కోర్టులో ఫిర్యాదు చేశారు. అనేక వాదనలు అనంతరం మెజిస్ట్రేట్ ఏ.విజయ రాజ్ కుమార్ ముద్దాయి కంది వెంకటరమణకు ఏడాది జైలు విధిస్తూ, ఏడు లక్షల 45 వేల రూపాయలు ఫిర్యాదుదారునికి చెల్లించాలని, అలాగే గవర్నమెంట్ ఫీజు కింద 5000 రూపాయలు చెల్లించాలని తుది తీర్పు చెప్పారు.



## ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో నెల్లూరు నగర నియోజకవర్గంలో

# కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రాంజీ నగర్ లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి..నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా.. ముద్రించిన పాంప్లేట్‌ను, సంతకాల సేకరణ ఫారాన్ని ఆవిష్కరించి నియోజకవర్గ స్థాయిలో చంద్రశేఖర్ రెడ్డి మొదటి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి కేవలం 11 మెడికల్ కళాశాలలు మాత్రమే ఉంటే వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏకంగా 17 నూతన మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారని అన్నారు. విద్య, వైద్యం, రెండు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జగన్మోహన్ రెడ్డి యత్నించారని తెలిపారు. ఈరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పిపిపి) మోడ్ అని చెబుతూ అన్ని వ్యవస్థలను ప్రైవేటుకు కట్టబెడుతుందన్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి నూతన మెడికల్ కళాశాలలో తీసుకు వచ్చారనే అక్కసుతోనే ఈరోజు చంద్రబాబు నాయుడు వాటన్నిటిని ప్రైవేటుకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ రాష్ట్రంలో దశలవారీగా 17 మెడికల్ కళాశాలను ప్రారంభించాలనే సంకల్పంతో జగన్మోహన్ రెడ్డి పనిచేసి ఇప్పటికే 7 మెడికల్ కళాశాలలను పూర్తి చేశారని తెలిపారు. మెడికల్ కళాశాల అంటే కేవలం కళాశాల మాత్రమే కాదని అది ఒక వ్యవస్థలా పని చేస్తూ ప్రజా ఆరోగ్యానికి అండగా సేవలందిస్తుందని తెలిపారు. ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉందంటే ఆ ప్రాంతంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలతో పాటు పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈరోజు అవేమీ పట్టవన్నట్టుగా కూటమి ప్రభుత్వం.. ప్రజల ఆకాంక్షను కూడా లెక్క చేయకుండా మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం సిగ్గుచేటన్నారు.

ఈరోజు మెడికల్ కళాశా లలను ప్రైవేటీకరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వైఎస్ఆర్సిపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అందులో భాగంగానే వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నెల్లూరు నగర నియోజకవర్గంలో 60 వేల నుంచి లక్ష సంతకాల వరకు సేకరిస్తామని తెలిపారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తి చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన గవర్నర్‌కి పంపి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తామన్నారు. అప్పటికి ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే.. కోర్టుల ద్వారా న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈరోజు ప్రైవేట్‌కు అప్పగించిన మెడికల్ కళాశాలన్నింటినీ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు దక్కేల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గార్డెన్ వరల్డ్‌లో నర్సరీ డీలర్ల ఆత్మీయ సమావేశం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ పొట్టే పాలెంలో గార్డెన్ వరల్డ్ ఆధ్వర్యంలో నర్సరీ డీలర్ల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గార్డెన్స్ నీడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.గౌతమ్ మల్హోత్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్లు లేకపోతే మానవాళి మనుగడ ఉండదని, ఆక్సిజన్ సిలిండర్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని ప్రతి ఒక్కరు తమకు గుర్తుండిపోయే రోజుల్లో మొక్కలు నాటాలని ఆకాంక్షించారు. ఆక్సిజన్‌ను విడుదల చేసే బోన్ సై, మొక్కలు పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుస్తాయని వీటిని ప్రతి ఒక్కరు నాటాలన్నారు. నర్సరీ యజమానులు ప్రజలకు అందుబాటు ధరల్లో మొక్కలను అందించాలని సూచించారు. ప్రతి నర్సరీ యజమాని సమాజ హితం కోసం కొన్ని మొక్కలను ఉచితంగా అందజేయాలని కోరారు. గార్డెన్ వరల్డ్‌లో మంచి నర్సరీని స్థాపించిన జెట్టి నవీన్ కుమార్ రెడ్డిని అభినందించారు. ఆత్మీయ సమ్య సమావేశం సందర్భంగా పలువురు నర్సరీ యజమానులను జెట్టి నవీన్ రెడ్డి సన్మానించి మెమెంటోళ్లు అందజేశారు. స్టెప్ అప్ అధినేత నేలకుర్తి రమణ ఆధ్వర్యంలో ఈవెంట్ ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గార్డెన్ నీడ్స్ జనరల్ మేనేజర్ పవన్ కుమార్, రవి గార్డెన్స్ బాపట్ల అధినేత జి రవీంద్ర సంజీవరెడ్డి, ప్రకృతి ప్రేమికుడు భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ మద్యంపై చర్యలు తీసుకోవాలి

**- వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నీలగిరి సంఘం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట విచ్చలవిడిగా తయారు చేస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలని కోరుతూ వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నకిలీ మద్యాన్ని తక్షణమే అరికట్టాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసిపి నాయకులు కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఎక్సైజ్ అధికారిని కలిసి నకిలీ మద్యం సూత్రధారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మెమోరాండం అందజేశారు. తెలుగు దేశం పార్టీ నేతలే నకిలీ మద్యం సూత్రధారులుగా చలామణి అవుతూ ఈ రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని పెంచి పోషిస్తున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం విషయంలో పారదర్శకతను పెంచి రాష్ట్రంలో అతి తక్కువ మద్యం షాపులు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో నకిలీ మద్యం ఊసే లేకుండా ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించి బెల్ట్ షాపులను, పర్మిట్ రూములను వైఎస్ జగన్మోహన్ రెడ్డి రద్దు చేసి విచ్చలవిడి మద్యానికి అడ్డుకట్ట వేసారని తెలిపారు. ఈరోజు అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం అన్నిటినీ ప్రైవేటుపరం చేస్తూ పోతుందన్నారు. ఈరోజు మద్యం షాపులను కూడా చంద్రబాబు నాయుడు టిడిపి నేతలకు కట్టబెడుతూ నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో టిడిపికి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రుల కనసన్నలోనే మద్యం షాపులు నడుస్తున్నాయన్నారు. అలా టిడిపి నేతల చేతుల్లో ఉన్న మద్యం షాపుల్లో నకిలీ మద్యం విచ్చలవిడిగా దొరుకుతుందన్నారు. అధికారి పార్టీ నేతలకు చెందిన షాపులు ఈరోజు మద్యం షాపుల్లో తనిఖీలు చేయాలన్న కేసులు నమోదు చేయాలన్న ఎక్సైజ్ అధికారులు భయపడే పరిస్థితికి వచ్చారన్నారు. ఈ పరిస్థితిలో నకిలీ మద్యం ఈ రాష్ట్రంలో ఏరులై పారుతుంది అన్నారు. ఇటీవల మదనపల్లిలో నకిలీ మద్యం తయారీ వ్యవస్థను నగర నడిబొడ్డునే మనం చూసామన్నారు. ఇలా నకిలీ మద్యం, చీప్ లిక్కర్‌తో పాటు గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుండడంతో ఎక్కువమంది మత్తుకు బానిసై పట్టపగలే హత్యలు చేసే స్థితికి దిగజారి పోయిందన్నారు. అలాగే కొంతమంది ఈ కల్తీ మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. కల్తీ మద్యం అమ్ముతున్న కేటుగాళ్లపై ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే వైఎస్ఆర్సిపి భవిష్యత్తులో దీనిపై పెద్ద పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉర్రూతలూగించిన కిషోర్ కుమార్ మ్యూజికల్ నైట్

**- ఎంపీ వేమిరెడ్డి దంపతుల సౌజన్యంతో తొలిసారి నెల్లూరులో - పాటలతో అలరించిన జావేద్ అండ్ టీం - భారీగా తరలి వచ్చిన సినీ ప్రేమికులు**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతుల సౌజన్యంతో తొలిసారిగా నెల్లూరులో జరిగిన సింగర్ కిషోర్ కుమార్ మ్యూజికల్ నైట్ - 2025 ఉర్రూతలూగించింది. ఆదివారం రాత్రి టౌన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సింగర్ జావేద్ అండ్ టీం కిషోర్ కుమార్ పాటలు పాడి ఆకట్టుకున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ ఏడాది జులై 20న నిర్వహించిన యాద్ ఏ రఫీ కార్యక్రమం సందర్భంగా గొప్ప సింగర్ కిషోర్ కుమార్ మ్యూజికల్ నైట్ కూడా నిర్వహించాలని, తాను అండగా ఉంటానని నాడు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు ఆదివారం జరిగిన మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. కళలను, కళాకారులను ప్రోత్సహించడంలో తాను ఎప్పుడూ ముందుంటానని మరోసారి రుజువు చేశారు. మ్యూజికల్ నైట్ సందర్భంగా పాడిన కిషోర్ కుమార్ పాటలు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి రెడ్డి సౌజన్యంతో తొలిసారి కిషోర్ కుమార్ మ్యూజికల్ నైట్ నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వి పి ఆర్ సహకారం లేకపోతే ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించలేమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని విధాల అండదండలు అందించిన విపిఆర్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నెల్లూరు రూరల్‌లో చంద్రన్న విద్యుత్ వెలుగులు : ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు కరెంటు కష్టాలు లేకుండా చేసేందుకు 3-ఫేస్ మరియు 24 గంటల కరెంటు కోసం 9,139 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్రమంతటా కూడా కరెంటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నెల్లూరు రూరల్‌లో 97% పనులు పూర్తిచేశాం. మరో 10 రోజుల్లో పనులు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయబోతున్నాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కనీవినీ ఎరుగని రీతిలో వివిధ రంగాలలో కోట్లాది మంది ప్రజలకు మేలుచేసే అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. కోట్లాది మంది ప్రజలకు కరెంటు కష్టాలు లేకుండా చేసేదానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో 18 గ్రామాలు, 3 డివిజన్లలో 28వేల కుటుంబాలకు షుమారు 80 వేల మంది ప్రజలకు కరెంటు కష్టాలు తీర్చే అభివృద్ధి పనులు అతి త్వరలో పూర్తి కాబోతున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఈ కార్యక్రమానికి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 'చంద్రన్న విద్యుత్ వెలుగులు' పేరుతో అతి త్వరలో ప్రజలకు అంకితం ఇవ్వబోతున్నాం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్, భారత ప్రధాని నరేంద్రమోడీ ఆశీస్సులతో చేపట్టిన ఈ బృహత్తర-మహోత్తరమైన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎంతో మేలుచేస్తుంది రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.

# సంపాదకీయం

## సర్వనాశనం రాగంగా శాంతిగీతం

ఏకపక్ష ప్రేమలూ, ఏకపక్ష యుద్ధాలూ, ఏకపక్ష శాంతి ఒప్పందాల్లేని దేశ చరిత్రలు లేవు! కనీస న్యాయం కావాలని ఘోషించే వారే తరచూ వీటికి బాధితులుగా కనపడతారు. ఇక కనీవినీ ఎరుగని జీవన విధ్వంసానికి సాక్షులుగా నిలిచిన వారికి నోరెత్తే పరిస్థితీ ఉండదు. గాజాలో ఇప్పుడదే జరుగుతోంది. తాము ప్రతిపాదించిన బలవంతపు శాంతి ఒప్పందానికి అంగీకరించకపోతే సర్వనాశనాన్నే చూస్తారనే హెచ్చరికలు అగ్రరాజ్య అధినేత ట్రంప్ నుంచి రావటంతో హమాస్‌కు వేరే దారి కనపడటం లేదు. హమాస్ పూర్తిగా దిగిరావచ్చు. పాదాక్రాంతమూ కావచ్చు. ఇజ్రాయెల్-అమెరికా పెట్టిన అన్ని షరతులకూ అంగీకరించొచ్చు. కానీ హమాసే గాజా కాదు. హమాసే పాలస్తీనా కాదు. ప్రజలను ఒక సంస్థకు గుత్తాధిపత్యంగా భావించలేం. బాధిత ప్రజలకు న్యాయం దక్కటమే లక్ష్యమైతే శాంతి ప్రణాళిక ఆ దిశగా ఉండాలి. కానీ అందులో ఆ ఛాయల్లేవు. బాధితుల గొంతు అందులో లేదు. చిరకాలంగా వారు కోరుకుంటున్న న్యాయమూ లేదు. పాలస్తీనా సమస్య పరిష్కారానికి అందులో నిర్దిష్ట చర్యల్లేవు. రెండు దేశాల ఏర్పాటు వాగ్దానం ఊసేలేదు. ఇజ్రాయెల్ కోరుకున్న రీతిలో శాంతి ప్రణాళిక ఉందనే విమర్శలే ప్రధానంగా వినపడుతున్నాయి. సుంకాల యుద్ధాలతో నలిగిపోతున్న దేశాధినేతలకు.. ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోటానికి శాంతి ప్రణాళిక ఒక సందర్భాన్ని సృష్టించింది. అది వేరే కథ! మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో సైతం పరాజితులు తమ విన్నపాలనూ బలంగానే విన్పించారు. పరాజితులు పరాభవ భారంతో మిగిలిపోకుండా, దాని ఆసరాగా ప్రజలను మళ్లీ యుద్ధోన్ముఖులను చేయకుండా ఉంచటానికి ప్రయత్నాలు జరిగాయి. రెండు ప్రపంచ యుద్ధాల్లో తలపడిన దేశాలన్నీ ఎంతోకొంత సమవుజ్జీలు కావటంతో పరాజితులు పూర్తిగా పాదాక్రాంతులు కాలేదు. లేచి నిలబడే స్వేచ్ఛను దక్కించుకున్నారు. లోగొంతుతో కొన్ని స్పష్టంగానే చెప్పారు. స్వంత మార్గంలో ముందుకు వెళ్లటానికి వెసులుబాట్లూ పొందారు. అందుకే పరాజిత దేశాలైన జర్మనీ, జపాన్‌లు పదేళ్లలోనే మళ్లీ పుంజుకుని ఆర్థికంగా కీలకంగా మారాయి. గాజా పరిస్థితి వేరు. 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఒక చిన్న ప్రాంతంలో జరిగిన బీభత్సమూ, విధ్వంసమూ ఈ శతాబ్దంలో మరెక్కడా చోటు చేసుకోలేదు. ప్రపంచంలోనే అత్యధికంగా శరణార్థులు ఉన్న చిన్న ప్రదేశం గాజా. అత్యధిక జనసాంద్రతలు కలిగిన వాటిల్లో అగ్రభాగాన ఉంది. మరణాలు, ఆస్తులు, సౌకర్యాల విధ్వంసాల గురించి ఇప్పటి వరకూ వస్తున్నవన్నీ తుది లెక్కలు కావు. ప్రాణాలు కోల్పోయిన వారు 67,000 నుంచి 84,000 మంది ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి. క్షతగాత్రులెందరో పూర్తిగా తెలియదు. అందులో పనిచేయగలిగిన వారెందరో చెప్పలేం. అనుకున్నట్లుగా శాంతి ప్రణాళిక అమలైతే, ఇజ్రాయెల్ దానికి అడ్డంకులు కల్పించకుండా ఉంటే అసలు లెక్కలు తేలతాయి. అప్పుడే యుద్ధనేరాల, కిరాతకాల సంపూర్ణస్వరూపం బయటపడుతుంది. 1948 నుంచీ ఇప్పటివరకూ అరబ్బు దేశాలతో ఇజ్రాయెల్ పరోక్ష, ప్రత్యక్ష యుద్ధాలు చాలానే చేసింది. వాటిల్లో మరణించిన వారి సంఖ్యతో పోల్చితే గాజా మృతులే ఎక్కువ. 1948 యుద్ధంలో 10 నుంచి 15 వేల వరకూ అరబ్బులు చనిపోయారు. 1967 నాటి ఆరురోజుల యుద్ధంలో 15,000 మంది మరణించారు. 1973 నాటి యుద్ధంలో 8,000 నుంచి 18,500 వరకూ మరణాలు చోటుచేసుకున్నాయి. ఏ కోణం నుంచి చూసినా గాజా యుద్ధమంత దారుణమైంది మరొకటి లేదు. అందుకే ఈ యుద్ధంతో ఇజ్రాయెల్ ప్రతిష్ఠ ఎన్నడూ లేనంతగా దిగజారిపోయింది. సామాజిక మాధ్యమాల్లో గాజా బీభత్సాల దృశ్యాలు చూసిన వారి హృదయాలు విషాదంలో బరువెక్కాయి. యువతలో ఆగ్రహాలు వెల్లువెత్తాయి. విశ్వవిద్యాలయాల్లో నిరసన ప్రదర్శనలు హోరెత్తాయి. నిరసనలకు నిలయాలైన వర్సిటీలకు అందించే ఆర్థిక సహాయానికి కత్తెరవేసే చర్యలు అమెరికాలో మొదలయ్యాయి. వియత్నాం యుద్ధసమయంలో కూడా వర్సిటీల్లో నిరసనలు జరిగాయి. ఇప్పటిలా వాటిపై కత్తికట్టలేదు. భావస్వేచ్ఛకు వీలు ఇవ్వని ఛాందస జాతీయవాదం ఎక్కడైనా చెరుపే చేస్తుందనటానికి ఇంతకంటే నిదర్శనం లేదు. పాలస్తీనా ప్రజల సమస్య పరిష్కారం అయితేనే గాజా, వెస్ట్‌బ్యాంకులో ప్రశాంతత నెలకొంటుంది. అక్కడి ప్రజలకు ఆమోదంలేని ఏ ప్రణాళికా దీన్ని సాధించలేదు. హమాస్ లాంటి తీవ్రవాద సంస్థలు కూడా ఒక దేశంగా ఇజ్రాయెల్ అస్తిత్వాన్ని అంగీకరిస్తున్నాయి. అరబ్బు దేశాలు కూడా ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ఇజ్రాయెల్‌ను ఇంకా గుర్తించని దేశాలు కూడా తెరవెనుక మంతనాలు సాగిస్తున్నాయి. ఏ దృష్టితో చూసినా ఇజ్రాయెల్ అస్తిత్వానికి ఇప్పుడు ప్రమాదమే లేదు. సైనికంగా ఇజ్రాయెల్‌తో తలపడే దేశం కూడా మధ్యప్రాచ్యంలో లేదు. దుస్సాహసం చేసినా ఓటమినే చూడాల్సి వస్తుంది. అంతటి శక్తిని ఇజ్రాయెల్ సంపాదించుకుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్ గతంలో కంటే భిన్నంగా ముందుకొచ్చి పాలస్తీనా సమస్యను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలి. కానీ ఒకనాటి పాలస్తీనా ప్రాంతమంతా గ్రేటర్ ఇజ్రాయెల్‌కే చెందాలనీ దైవనిర్దేశం ప్రకారం అది జరిగి తీరుతుందనే మత విశ్వాసాలు గల పార్టీలపై ఆధారపడి అధికారాన్ని నెట్టుకొస్తున్న ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అందుకు సిద్ధంగా లేరు. ఆయన నాయకత్వం వహిస్తున్న లికుడ్ పార్టీకి కూడా పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పాటు కావటం ఇష్టంలేదు. పరిమిత అధికారాలతో కూడిన స్వయంపాలనను పాలస్తీనాకు ఇవ్వటానికి కూడా లికుడ్ పార్టీలో అతివాదులు అంగీకరించరు. వాదనలో సహేతుకత లేనప్పుడూ, ఏ విధంగానైనా ఐక్యరాజ్యసమితి తీర్మానాలను కాలరాయాలని అనుకున్నప్పుడూ అతివాదులకు మతమే ఆలంబనగా ఉంటుంది.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

## - రాజోలులో పల్లె పండుగ 2.0 ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్





**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఈనెల 17వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో పల్లె పండుగ 2.0 పను లను ప్రారంభించనున్నారని అందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేయాలని రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ అధికారులను కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో ఈ నెల 17వ తేదీ శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రాథమిక స్థాయి సమావేశం నిర్వహించారు. శాసన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ మొట్టమొదటిసారిగా రాజోలు నియోజక వర్గం పర్యటనకు వస్తున్నందున పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేసి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. శంకరగుప్తం మురుగు కాలువ విధ్వంసం కారణంగా 15 గ్రామాల్లో ఉప్పునీరు పైకి రావడం, డ్రైనేజీ పూడిక తీయకపోవడంతో సుమారు అర్ధ కిలోమీటర్ పొడవునా డ్రైనేజీ నీరు పైకి పొంగి ప్రవహించడంతో సుమారు లక్ష కొబ్బరి చెట్లు చనిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖ మాత్యులు నిమ్మల రామానాయుడు సందర్శించి డ్రైన్ కూడికతీతకు రూ.9 కోట్ల 7 లక్షలు గ్రాంట్ మంజూరు చేస్తానని అదే విధంగా గట్ల బలోపేతానికి రూ.6 కోట్లు నిధులు మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. ఇదే విషయమై శాసనసభ సమావేశాలలో ఉప ముఖ్యమంత్రివర్యులతో చర్చించడం జరిగిందని ఈ మేరకు ఆయన స్వయంగా పరిశీలనకు రావాలని ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా పల్లె పండుగ 2.0 పనులను ప్రారంభించేందుకు, సి ఎస్ ఆర్ నేషనల్ గ్రీన్ ట్రిబునల్ నరేగా అనుసంధానంతో చేపట్ట బోయే పనులకు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపనలు నిర్వహించేందుకు వస్తున్నట్లు వెల్లడించారు. తొలుత కేసనపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకొని బ్రిడ్జ్ వ్యూపాయింట్ నుండి డ్యామేజీని పరిశీలించి అనంతరం సుమారు 200 మంది రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారని తెలిపారు. అనంతరం ములిగిపల్లి సెంటర్ చేరుకొని కాట్రేనిపాడు లంక వద్ద 7 గ్రామాలకు సంబంధించి రూ. 3.20 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అలాగే నరేగా అనుసంధానంతో జిల్లా కలెక్టర్ ప్రతిపాదించిన పనులకు శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమాలు నిర్వ హిస్తారన్నారు. రూ 3.4 కోట్లతో గుడిమెల్లంక రాపిడ్ పిల్లర్, ఎన్జీటీ నిధులతో రూ. 7.5 కోట్లతో ఓహెచ్ఎస్ఆర్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. పల్లె పండుగ 2.0లో పూర్తి చేసిన 117 పనులను డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారన్నారు. ఆర్ అండ్ బి ద్వారా సుమారు రూ.7 కోట్లతో ఆరు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. శివకోడు జాతీయ రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని పల్లె పండుగ 2.0 గురించి ప్రసంగిస్తారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా కావలసిన ఏర్పాట్లను ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి ప్రశాంతి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, డిఆర్ఓ కే మాధవి జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# చైర్‌పర్సన్ అవిశ్వాసం తీర్మానం రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ అవిశ్వాస తీర్మానం చెల్లదంటూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. సామర్లకోట మునిసిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై స్వపక్ష కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సక్రమంగా జరగలేదని పేర్కొంటూ, రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం (హైకోర్టు) ఆ తీర్మానాన్ని కొట్టి వేసింది. ఈ మేరకు ఈ ఏడాది ఏప్రిల్‌లో అధికార వైసీపీకి చెందిన 25 మంది కౌన్సిలర్లు ఈ సంవత్స రం ఏప్రిల్‌లో గంగిరెడ్డి అరుణపై అవిశ్వాస ప్రతిపాదన లేఖలను జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్,ముని సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యలకు అందజేశారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆ లేఖలను పరిశీలించి, మే 15వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దానితో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబు ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ సమావేశం లోపభూయిష్టమని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అప్పట్లో సమావేశం కొనసాగించవచ్చని, కానీ ఫలితాన్ని ప్రకటించరాదని ఆదేశాలు జారీ చేసింది. ఈ సమయంలో, మే 15న అవిశ్వాస సమావేశానికి రెండు గంటల ముందు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ రాజీనామా లేఖను మునిసిపల్ కమిషనర్‌కు సమర్పించారు. అనంతరం మే 17న ఆమె తన రాజీనామా ఉపసంహరణ పత్రాన్ని కూడా సమర్పించారు. తాజాగా ఈ నెల 10వ తేదీన హైకోర్టు తుది తీర్పు వెలువరించింది. మే 15న జరిగిన అవిశ్వాస తీర్మా నం సక్రమంగా జరగలేదని, కాబట్టి ఆ తీర్మానం చెల్లుబాటు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య స్పష్టం చేశారు. "హైకోర్టు తీర్పు నకలు ఈరోజు కార్యాలయానికి ఆన్లైన్‌లో అందినట్లు ఆమె చెప్పారు.

# మెగా డిఎస్సీలో పది మంది ఉపాధ్యాయులు చేరిక




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మెగా డిఎస్సి 2025లో ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం సామర్లకోట మండలంలో విధుల్లో చేరారు. సామర్లకోట మండలంలో పది మంది నూతన ఉపాధ్యాయులు ఎస్ఎ, బిఎస్, ఎస్ఎస్, పిడి అంశాలకు సంబంధించి ముగ్గురు ఉపాధ్యాయులు, సామర్లకోట మున్సిపల్ పరిధిలో గల ప్రాథమిక పాఠశాలలకు సంబంధించి ఏడుగురు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఏడుగురు వారికి కేటాయించిన పాఠశాలలో విధుల్లో చేరినట్టు మండల విద్యాశాఖ అధికారి వై శివరామ కృష్ణయ్య, పి పుల్లయ్యలు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ బయోలా జికల్ సైన్స్ విభాగానికి సంబంధించి ఎన్నికకాబడిన అభ్యర్థి ఎస్టీ జికే మున్సిపల్ హైస్కూల్ సామర్ల కోటలోను, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌కు సంబంధించి ఎంపిక కాబడిన అభ్యర్థి మున్సిపల్ హైస్కూల్ అయోధ్య రామపురంనందు, స్కూల్ అసిస్టెంట్ పిడి అంశానికి సంబంధించి ఎంపిక కాబడిన అభ్యర్థి మండలంలో జి మేడపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధుల్లో చేరినట్టు తెలిపారు. ఇంకా సామర్లకోట మునిసిపల్ పరిధిలోగల జగ్గమ్మ గారి పేట పాఠశాలలో ఒక ఎస్జీటీ, ఎస్ కొత్తూరు పాఠశాలలో ఒక ఎస్జీటీ, బలుసుల పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఒక ఎస్జీటీ, ఎస్టిజికే మున్సిపల్ హైస్కూల్ నందు నలుగురు ఎస్జీటీలు మొత్తం పది మంది నూతన ఉపాధ్యాయులు సామర్లకోట మండలంలో పాఠశాలలో సోమవారం విధుల్లో చేరినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో శివరామ కృష్ణయ్య, పుల్లయ్యలు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి సబ్జెక్టు టీచర్ల కొరతతో బాధపడుతున్న పాఠశాలలకు నూతన ఉపాధ్యాయుల చేరికతో కొరత తీరిందన్నారు. అలాగే కొత్త ఉపాధ్యాయులంతా తమ తమ పాఠశాల విధులు పట్ల అలసత్వం ప్రదర్శించకుండా కొత్త పద్ధతులు ఉత్సాహంగా పనిచేసి పాఠశాల అభివృద్ధిలో మీ సహకారం అందించాలని కోరినట్టు వారు తెలిపారు.

# అక్రమ చేపల గుంతల నుండి రక్షించండి...తరుణవాయి గ్రామ ప్రజలు





**సంగం, (రాజధాని వార్తలు):** సంగం మండలం తరుణవాయి గ్రామంలో రెవెన్యూ అనుమతులు లేకుండా అక్రమంగా చేపల గుంతలు ఏర్పాటు చేస్తున్న చేపల అక్రమ వ్యాపారస్తులు నుండి రక్షణ కల్పించాలని తరుణ్వాయి గ్రామస్తులు సోమవారం తాసిల్దార్ సోమ్లా నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామ టిడిపి నాయకుడు మాటలు విని కొంతమంది ఆయన అం డదండలతో అనుమతులు లేకుండా చేపల గుంతలను వేసే అక్రమాదారులు రెచ్చిపోతున్నారు. మంత్రి ఆనం కు చెడ్డపేరు చేస్తున్న ఈ చోట నాయకుడు ఆగడాలు ఎక్కువైపోయాయని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. ఇటువంటి చోటా నాయకుల వల్ల మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి చెడ్డ పేరు వస్తుంది. ఇటువంటి వాళ్లను మంత్రి ఆనం పక్కన పెట్టాలని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. తరుణవాయి, వంగల్లు గ్రామాలలో చేపల గుంతలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గుంతలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సోమ్లా నాయక్‌కు వినతిపత్రం అందజేసిన గ్రామ రైతులు. చేపల గుంతల వలన వరి సాగుచేసుకునే రైతులంతా తీవ్రంగా నష్టపోతామని వాపోయిన రైతులు. తాసిల్దార్ సోమ్లా నాయక్ మాట్లాడుతూ గ్రామంలో గ్రామ సభలను నిర్వహించి అందరి అందరి రైతులతో మాట్లాడి రైతుల సమ్మతితోనే చేపల గుంతలకు అనుమతులు ఇవ్వాలా వద్దా అని నిర్ణయం తీసుకుంటామని రైతులకు తహసీల్దార్ సోమ్లా నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తరుణ్వాయి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# చెరువు ఆక్రమణలను అడ్డుకోవాలని మండల రెవెన్యూ అధికారికి వినతి పత్రం : జనసేన బొబ్బేపల్లి



**మనుబోలు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లాలో రెండో స్థానంలో ఉన్నటువంటి సర్వేపల్లి రిజర్వాయర్ వేల ఎకరాలకు సాగునీరు రెండు మండలాలకి తాగునీరు అందిస్తూ కొన్ని వందల కుటుంబాలు మధ్య సంపదపై జీవనాన్ని గడుపుతున్నారు అయితే ఈ రిజర్వాయర్‌ని కొంతమంది వాళ్ళు ఇష్టానుసారంగా ఆక్రమణ చేయడం జరుగుతుంది ఇలా ఆక్రమించుకుంటూ పోతే చివరికి సర్వేపల్లి రిజర్వాయర్ కనుమరుగేటువంటి పరిస్థితి కాబట్టి దీనిపైన వెంటనే స్పందించి సర్వే చేసి హద్దులు నాటి సర్వేపల్లి రిజర్వాయర్‌ని ఆక్రమణదారుల చెరలో నుంచి కాపాడుతారని కాపాడాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాం కూటమిలో భాగంగా సర్వేపల్లి రిజర్వాయర్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజల మీద కూటమి నాయకుల మీద ఉంది కాబట్టి ప్రతి ఒక్కరు కూడా రిజర్వాయర్ కాపాడుకునే దానికి అడుగులు ముందుకు వేయాలని మనస్ఫూర్తిగా కోరుతూ అధికారులు వెంటనే ఇరిగేషన్ సిబ్బంది కావచ్చు మండల రెవెన్యూ అధికారులు కావచ్చు త్వరితగతిన చెరువుని సర్వే చేయవలసిందిగా కోరుతున్నాం.

# ప్రభుత్వ ఐటిఐ కళాశాల పనులు ప్రారంభం

## - మండల టిడిపి అధ్యక్షులు బాణా శ్రీనివాసులు రెడ్డి



**సంగం, (రాజధాని వార్తలు):** సంగం మండలం అమరప నాయుడు కండ్రిక ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమం వద్ద ప్రభుత్వ ఐటీఐ కళాశాల పనులను మండల టిడిపి అధ్యక్షులు బాణా శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతోనే ప్రభుత్వ ఐటిఐ కళాశాల పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. బాణా శ్రీనివాసులు రెడ్డి, లగడపాటి రామలక్ష్మ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఐటి కళాశాల ఇక్కడికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకోడానికి ఉపయోగపడుతుందన్నారు. ఐటిఐ చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాలు స్థిరపడి ఉన్నారన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, చదువు చెప్పిన కళాశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పిట్టు పట్టాభి రామిరెడ్డి, సంగం సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు, టీడీపీ ఐటి వింగ్ ముత్యాల విజయ చంద్ర,ఉక్కాల శ్రీనివా సులు, రమణయ్య నాయుడు, జిల్లా ఆర్యవైశ్య నాయకులు గునుపూడి గిరి, హజరత్ రెడ్డి, బాణా రమణారెడ్డి, సూరాయపాలెం పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మెగాస్టార్ సరసన యంగ్ బ్యూటీ?




మెగాస్టార్ చిరంజీవి స్పీడు చూస్తుంటే కుర్ర హీరోలు కూడా దాన్ని తట్టుకోలేరేమో అనిపిస్తుంది. వరుస సినిమాలను చేస్తూ బిజీగా ఉన్న చిరూ, ఇప్పటికే విశ్వంభర మూవీ షూటింగ్ను పూర్తి చేసి, ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకరవరప్రసాద్ గారు సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అనిల్ సినిమా అంటే ఎంత స్పీడ్ గా పూర్తవుతుందో తెలిసిందే. శరవేగంగా జరుగుతున్న శంకరవరప్రసాద్ గారు షూటింగ్ శంకరవరప్రసాద్ గారు షూటింగ్ను పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్న చిరూ, ఓ వైపు ఆ షూటింగ్ ను చేస్తూనే ఇప్పుడు మరో సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లడానికి రెడీగా ఉన్నారు. అనిల్తో సినిమా తర్వాత మెగాస్టార్.. బాబీ కొల్లి దర్శకత్వంలో ఓ సినిమా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. వాటిలో బాబీ సినిమాను ముందుగా చేయనున్నారు చిరంజీవి. చిరూ కెరీర్లో 158వ సినిమాగా రూపొందనున్న ఈ సినిమా ఇప్పటికే అనౌన్స్ కూడా అయింది. చిరూ, బాబీ కాంబినేషన్ లో గతంలో వాల్తేరు వీరయ్య సినిమా వచ్చి ఆ సినిమా సూపర్ హిట్గా నిలవడంతో ఈ మూవీపై అందరికీ భారీ అంచనాలు నెలకొన్నాయి. అసలే చిరంజీవి అభిమాని అయిన బాబీ, ఈసారి మెగా158తో వాల్తేరు వీరయ్యను మించిన హిట్ అందుకోవాలని చూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం మెగా158 సినిమా నవంబర్ 5న పూజా కార్యక్రమాలతో మొదలు కానుందని, జనవరి నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరగనుందని తెలుస్తోంది. అంతేకాదు, ఈ సినిమాలో ఒక ఫీమేల్ లీడ్ కోసం మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్తో మేకర్స్ డిస్కషన్స్ చేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తలు విని నెటిజన్లు ఒక్కొక్కరు ఒక్కోలా రియాక్ట్ అవుతున్నారు.

చిరూలాంటి సీనియర్ స్టార్ సరసన నటించేందుకు మాళవిక ఒప్పుకుంటుందా అని కొందరు ప్రశ్నిస్తుంటే, మరికొందరు మాత్రం మెగాస్టార్తో ఛాన్స్ వస్తే వదులుకుంటుందా అని అంటున్నారు. ఇంకొందరైతే ఇద్దరి మధ్యా ఏజ్ గ్యాప్ బాగా ఉంది కాబట్టి స్క్రీన్పై వారి జంట ఆడియన్స్కు నచ్చుతుందో నచ్చదో అని అభిప్రాయపడుతూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం మాళవిక తెలుగులో ప్రభాస్ సరసన ది రాజా సాబ్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.

# ఇప్పుడు దీపికాను సమర్ధించడం అవసరమా షాలిని..?





అర్జున్ రెడ్డి సినిమాతో హీరోయిన్గా కెరీర్ను ఆరంభించిన షాలిని పాండే ఎంట్రీతోనే అదరగొట్టింది. సౌత్లో అంతకు ముందు వరకు ఏ హీరోయిన్ పెట్టని లిప్ లాక్ సీన్స్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. షాలిని పాండే ఖచ్చితంగా బాలీవుడ్ పీస్ అంటూ చాలా మంది కామెంట్స్ చేశారు. అంతే కాకుండా సోషల్ మీడియాలో ఒక్కసారిగా ఆమెకు మంచి డిమాండ్ పెరిగింది. కానీ అర్జున్ రెడ్డి విజయం ఆమె కెరీర్ను టర్న్ చేయలేక పోయింది. ఆ సినిమా హిట్ అయింది, సినిమాలోని ఆమె పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. కానీ ఆమె మాత్రం ఇండస్ట్రీలో బిజీ కాలేక పోయింది. అర్జున్ రెడ్డి వల్ల కొన్ని సినిమా ఆఫర్లు వచ్చాయి. కానీ అవి పెద్దగా ఆమె కెరీర్ను నిలబెట్టలేక పోయాయి. ప్రస్తుతం ఆఫర్ల కోసం ఎదురు చూస్తున్న ఈ అమ్మడు తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చనీయాంశం అయ్యాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకునే ఇండస్ట్రీలో హీరోయిన్స్ ఖచ్చితంగా 8 గంటల పని సమయం రూల్ను పాటించాలని చెబుతూ వస్తుంది. ఆ రూల్ కారణంగానే దీపికా కొన్ని సినిమాలను సైతం వదులుకుంది అనే వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా ప్రభాస్తో సందీప్ వంగ దర్శకత్వంలో రూపొందుతున్న 'స్పిరిట్' సినిమాతో పాటు, ప్రభాస్ కల్కి 2 సినిమా నుంచి కూడా 8 గంటల వర్కింగ్ రూల్ కారణంగానే దీపికా తప్పుకుందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇండస్ట్రీలో హీరోయిన్స్ను లెక్కకు మించి గంటలు వర్క్ చేయిస్తున్నారు. అలా చేయడం వల్ల మానసిక సమస్యలు తలెత్తడంతో పాటు, ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే సినిమాల షూటింగ్ను కేవలం 8 గంటలకు పరిమితం చేయాల్సిందే అంటూ ఆమె ఒక ఉద్యమంను మొదలు పెట్టిన విషయం తెల్సిందే. దీపికా పదుకునే చెబుతున్న 8 గంటల షూటింగ్ను చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. ఇతర పనుల విషయంలో 8 గంటల సమయం అనేది వర్కౌట్ అవుతుంది. కానీ షూటింగ్ విషయంలో అలా సాధ్యం కాదని చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 8 గంటల సమయంలో కనీసం రెండు నుంచి మూడు గంటల షూటింగ్ కూడా జరగదు అని, అందుకే ఎక్కువ సమయం విశ్రాంతిలోనే నటీనటులు ఉంటారు కనుక వారు 8 గంటల పని నిబంధన పాటించాల్సిన అవసరం లేదు అనేది చాలా మంది వాదన. కానీ హీరోయిన్ దీపికా పదుకునే మాత్రం తాను ఇప్పటికే ఆ నిబంధన పెట్టుకుని ప్రారంభించడం మొదలు పెట్టింది. ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్స్ సైతం ఆ నిబంధనను పాటించేందుకు సిద్ధం అవుతున్నట్లుగా తెలుస్తోంది. అందులో ఒకరుగా అర్జున్ రెడ్డి హీరోయిన్ షాలిని పాండే నిలువబోతున్నారు. ఇటీవల షాలిని పాండే ఒక చిట్ చాట్లో మాట్లాడుతూ... తనకు దీపికా పదుకునే అంటే చాలా అభిమానం. స్కూల్ డేస్ నుంచి ఆమెను చూస్తూనే ఉన్నాను. ఆమెను హీరోయిన్గా చాలా అభిమానిస్తాను, అంతే కాకుండా ఆమెను వ్యక్తిగతంగా కూడా ఆరాధిస్తాను. అందుకే ఆమె తీసుకు వచ్చిన 8 గంటల పని సమయంను తాను సమర్ధిస్తున్నాను. ఆమె తీసుకున్న నిర్ణయం అందరికీ ఉపయోగదాయకంగా తాను భావిస్తున్నాను అంది. అంతే కాకుండా కేవలం 8 గంటలు మాత్రమే వర్క్ చేస్తాను అని చెప్పడం ఆమె హక్కు, అది మానసిక ఆరోగ్యంను దెబ్బ తీయదు అని నేను నమ్ముతున్నాను. అందుకే నేను ఆ 8 గంటల పని సమయం నిబంధన పాటించడంలో తప్పు లేదు అనిపిస్తుందని చెప్పుకొచ్చింది. ప్రతి మనిషికి విశ్రాంతి అవసరం అనేది ఆమె అభిప్రాయం. దాన్ని మనం సమర్ధించాల్సిందే అని మరో నటి కొంకనా సేన్ శర్మ అన్నారు. పెద్దగా ఆఫర్లు లేని షాలిని పాండే ఈ సమయంలో 8 గంటల నిబంధన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, ఇలా అయితే ఆఫర్లు ఎలా వస్తాయంటూ ఆమెను ప్రశ్నిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. మరి దీనికి షాలిని ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి.

# ఎన్టీఆర్ లేటెస్ట్ లుక్.. ఫ్యాన్స్ ఏమంటున్నారు?





టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్.. ఎన్ని సినిమాలు చేసినా.. ఎన్ని వర్కౌట్లు చేసినా.. ఎంత బరువు తగ్గినా ముఖంలో కళ అలాగే ఉంటుంది. ఇది ప్రతి ఒక్క సినీ ప్రియుడికి, అభిమానికి తెలిసిందే. అప్పట్లో కంత్రి సినిమాకుగాను ఎన్టీఆర్ బాగా బరువు తగ్గారు. కానీ ఫేస్లో గ్రీస్ పోలేదు. యమ దొంగ తర్వాత స్టైలిష్ లుక్లోకి చేంజ్ అయ్యారు. ఆ తర్వాత నుంచి మూవీ మూవీకి.. వెయిట్ను పెంచుకుంటూ వెళ్లారు..తగ్గించుకుంటూ వచ్చారు.. కానీ అభిమానులు మాత్రం అసంతృప్తికి గురికానివ్వకుండా మెయింటైన్ చేస్తూ వచ్చారు. బ్లాక్ బస్టర్ హిట్ ఆర్ ఆర్ ఆర్ సినిమా కోసం బరువు పెరిగారు. ఆ తర్వాత చేసిన దేవర మూవీ కోసం తగ్గారు. వార్-2 మూవీ కోసం ఇంకా బరువు తగ్గిపోయారు. ఫేస్లో మాత్రం ఎన్టీఆర్ తన కళ పోనివ్వలేదు. కానీ ఇప్పుడు అలా లేదు. డ్రాగన్ కోసం ఎన్టీఆర్ బాగా బరువు తగ్గారు. కళ మాత్రం మిస్ అవ్వడం ఫ్యాన్స్ను ఆందోళన చెందేలా చేస్తుంది. వార్-2 మూవీ టైమ్లో కొద్దిగా పర్లేదనిపించినా.. ఇప్పుడు పూర్తిగా బక్కి చిక్కి కనిపిస్తున్నారు. రీసెంట్గా జరిగిన బావమరిది పెళ్లిలో తారక్ చాలా సన్నగా కనిపించారు. ఆ తర్వాత ఇటీవల ఓ ఫ్యాన్తో ఫోటో దిగారు. బావమరిది నార్నే నితిన్ పెళ్లిలో మెరిసిన ఎన్టీఆర్కు.. ఇప్పుడు ఫ్యాన్తో కలిసి దిగిన పిక్లో ఉన్న తారక్కు చాలా డిఫరెన్స్ ఉందని చెప్పాలి. దీంతో ఆ విషయం ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. అనేక మంది తారక్ అభిమానులు, సినీ ప్రియులు, నెటిజన్లు ఇప్పుడు రెస్పాండ్ అవుతున్నారు. సన్నగా ఉన్నా కూడా పర్లేదని, కానీ ముఖంలో అసలు కళ లేదని కామెంట్లు పెడుతున్నారు. సినిమాలో రోల్ కోసమే అంత తగ్గారా అంటూ క్వశ్చన్ చేస్తున్నారు. అదే సమయంలో టైటిల్ లుక్.. ఇప్పటి లుక్కు ఎలాంటి సంబంధం లేదని అంటున్నారు. ఇంకొందరు ఫ్లాష్ బ్యాక్లో వచ్చే సీన్స్ కోసం ఇలా సన్నగా అయ్యారేమోనని అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ఇలా తారక్ను చూడలేకపోతున్నామని పలువురు కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు సినిమా కోసం అయితే పర్లేదు.. జూనియర్ ఎన్టీఆర్ డెడికేషన్ అండ్ హార్డ్ వర్క్కు ఇదే నిదర్శనమని అంటున్నారు. కొత్త మూవీకి ఆల్ ది బెస్ట్ కూడా చెబుతున్నారు. త్వరలోనే తమ అభిమాన స్టార్ను శక్తివంతమైన, ఆకర్షణీయమైన వ్యక్తిగా తిరిగి చూడాలని ఆశిస్తున్నట్లు చెబుతున్నారు.

# చీర కట్టులో మరింత అందంగా మారిన రాశిఖన్నా!



ప్రస్తుత కాలంలో హీరోయిన్లు ఒకవైపు ఫాలోవర్స్ను పెంచుకుంటూనే.. మరొకవైపు తమ సినిమాలను ప్రమోట్ చేయడానికి సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్గా ఉంటున్నారు. ఈ క్రమంలోనే చాలామంది హీరోయిన్స్ ఇలా తమ గ్లామర్తో ఆకట్టుకుంటూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. పైగా సినిమాలకు సంబంధించిన పలు విషయాలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా తన మూవీ ప్రమోషన్స్లో భాగంగా గ్లామర్తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ప్రముఖ హీరోయిన్ రాశీ ఖన్నా. తన అందంతో.. అమాయకత్వంతో.. అంతకుమించి ఆకట్టుకునే నవ్వుతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం సిద్దు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టిలతో కలిసి 'తెలుసు కదా' అనే సినిమా చేస్తోంది. అక్టోబర్ 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది ఈ సినిమా. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో.. ప్రమోషన్స్లో జోరుగా పాల్గొంటుంది. అందులో భాగంగానే ప్రమోషనల్ ఇంటర్వ్యూలలో తన వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలను పంచుకుంటున్న ఈమె..ఇటు సోషల్ మీడియా ద్వారా గ్లామర్ డోస్ పెంచేసి అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. తాజాగా తెలుసు కదా సినిమా ప్రమోషన్స్లో భాగంగా చీర కట్టులో దర్శనమిచ్చింది రాశి ఖన్నా.. క్రీమ్ కలర్ ప్రింటెడ్ చీర కట్టుకున్న ఈమె.. ఆ చీరపై ఆరెంజ్ రెడ్ కలర్ మిక్స్ కాంబినేషన్లో ఫ్లవర్స్తో చాలా అందంగా డిజైన్ చేశారు. దీనికి కాంబినేషన్లో బ్లౌజ్ ధరించిన ఈమె.. స్లీవ్ లెస్ అందాలతో అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేసింది. తాజాగా రాశి ఖన్నా షేర్ చేసిన ఈ సింపుల్ లుక్ ఫొటోస్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు. రాశి ఖన్నా సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తెలుసు కదా సినిమాలో నటిస్తున్న ఈమె.. మరొకవైపు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇందులో పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తుండగా.. శ్రీ లీల హీరోయిన్గా నటిస్తోంది. అంతేకాదు హరీష్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో రాశిఖన్నా కోసం ఒక ప్రత్యేకమైన పాత్రను డిజైన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రంతోపాటు బాలీవుడ్లో 120 బహదూర్ అనే సినిమాతో పాటు మరో మూడు చిత్రాలకు అక్కడే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. రాశిఖన్నా కెరియర్ విషయానికొస్తే మద్రాస్ కేఫ్ సినిమా ద్వారా సహాయక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగులో 2014లో వచ్చిన ఊహలు గుసగుసలాడే సినిమాతో పరిచయమైంది. మొదటి సినిమాతోనే ఉత్తమ మహిళా అరంగేట్రం విభాగంలో సైమా అవార్డును కూడా దక్కించుకుంది. ఆ తర్వాత బెంగాల్ టైగర్, సుప్రీం, జై లవకుశ, తొలిప్రేమ, వెంకీ మామ, ప్రతిరోజు పండగే ఇలా చెప్పుకుంటూపోతే చాలా చిత్రాలలో నటించింది ఈ ముద్దుగుమ్మ. తెలుగులోనే కాదు తమిళ్, హిందీ భాషల్లో కూడా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది.

# అన్యాయంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి కొనసాగించకపోతే పోరాటం తప్పదు

## - ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుకుంటూ ప్రభుత్వ వైద్య అధికారులుగా విధులు నిర్వహించవచ్చా? - నెల్లిమర్ల సి.హెచ్.సి సూపరింటెండెంట్ తిరుమల దేవి ఉదయం 9 గంటలకి విధులకి హాజరు కాకపోయిన ప్రభుత్వ నిబంధనలు వర్తించవా? - ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్



**నెల్లిమర్ల, (రాజధాని వార్తలు):** నెల్లిమర్ల సి.హెచ్.సి సూపరింటెండెంట్ తిరుమల దేవి ఉదయం 9 గంటలకి విధులకి హాజరు కాకపోయిన ప్రభుత్వ నిబంధనలు వర్తించవా, ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుకుంటూ ప్రభుత్వ వైద్య అధికారులుగా విధులు నిర్వహించవచ్చా అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం ఉదయం నెల్లిమర్ల సి. హెచ్. సి దగ్గర ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన నిరసన ధర్నాలో హాజరైన ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ నెల్లిమర్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సి.హెచ్.సి) లో 20 ఏళ్ళుగా పని చేస్తున్న బడుగు పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులను హాస్పిటల్ సూపరింటెండెంట్ తిరుమల దేవిని బకాయి ఉన్న 2 నెలల జీతాలు, పి.ఎఫ్ డబ్బులు కాంట్రాక్టర్ల చేత ఇప్పించమని, ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం పెరిగిన జీతాలు పూర్తిగా ప్రతి నెల 10వ తేదిలోపు ఇప్పించి, సెలవులు మంజూరు చేయమని, హాస్పిటల్‌లో ఓ.పిలు పెరుగుతుండటం వలన ముగ్గురు కార్మికులు చేస్తున్న పనిని ఒక్కరితో చేయించడం వలన అనారోగ్యం పాలవుతున్నాం కాబట్టి వర్కర్ల సంఖ్య పెంచి పని ఒత్తిడి తగ్గించమని కోరితే ఆ విషయాలు మాకు సంబంధం లేదని నిరక్ష్యాంగ సమాధానం ఇస్తు పట్టించుకోలేదు. కాబట్టి కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం శాంతియుత పద్ధతిలో నిరసన తెలిపి పై అధికారులకి వినతిపత్రాలు ఇస్తున్నారని కార్మికులపై నిర్ధాక్షిణ్యంగా ఉద్దేశ్యపూర్వకంగా ఇద్దరు కార్మికులను తొలగించారు. ఇదేమి అన్యాయమని అడిగితే దూరంగా వేరే ఊర్లుకి బదిలీలు చేస్తాను నచ్చితే బదిలీ చేసిన చోటుకి వెళ్లండి లేకపోతే మానేయండి అని కార్మికులను విపరీతమైన ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయండి అని అడిగితే కక్ష సాధింపు చర్యలకు పాల్పడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల చేత జీతాలు ఇప్పించడంలో చూపని శ్రద్ధ స్థానిక ఎమ్మెల్యేపై, ఎమ్మెల్యే పి.ఏపై ఒత్తిడి చేసి కార్మికులను తొలగింపులు, బదిలీలపై ఎందుకు అంత శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. హాస్పిటల్‌లో మౌళిక వసతులు లేవు, ప్రహరీ గోడ కూలిపోయింది, ప్రధాన రహదారి గేటు విరిగిపోయింది, వర్షం పడితే హాస్పిటల్‌లో వర్షం నీరు కారిపోతుంది, మంచాలు, వార్డులు పూర్తిస్థాయిలో లేవు, పేషంట్లకు తోడుగా వచ్చిన వారికి బయట భోజనం చేయడానికి షెల్టర్లు ఏర్పాటు చేయలేదు, మినరల్ వాటర్ ఆర్.ఓ ప్లాంట్ ఏర్పాటు చేయకపోవడం వలన వచ్చే పేషంట్లుకి మంచి నీరు సదుపాయం లేదు, డ్రెయినేజీ సదుపాయం లేదు ఇన్ని రకాల కనీస మౌళిక వసతులు లేకపోయినా వాటి దృష్టి పెట్టకుండా కాయకష్టం చేసుకుని చాలీచాలని వేతనాలతో బతుకు జీవుడా అని పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వేధింపులకు గురి చేయడం చాలా దుర్మార్గమన్నారు. ప్రజా ధనాన్ని జీతాలుగా తీసుకుంటూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం సమయానికి ఆసుపత్రి విధులకు హాజరు కాకపోయినా ఎలాంటి చర్యలు తీసుకోరు కానీ కార్మికులు న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయమని అడిగితే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుకుంటూ ప్రభుత్వ వైద్యులుగా, అధికారులుగా విధులు నిర్వర్తిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను కొనసాగించాలని, జీతాలు పూర్తిగా చెల్లించాలని మొదలైన సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని అశోక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నెల్లిమర్ల మండల కార్యదర్శి, జిల్లా సమితి సభ్యులు మొయిద పాపారావు హాజరై సంఘీభావం తెలిపారు. శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్‌లు పాల్గొన్నారు.

# అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

## - విద్యార్థుల సౌకర్యాలు, పాఠశాల వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి







**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ విద్యార్థుల సౌకర్యాలు, పాఠశాల వసతుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో సోమవారం పాత కొత్తగూడెం ప్రాంతంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, వసతులు, మధ్యాహ్న భోజన వంటశాల, శానిటేషన్ వ్యవస్థలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన వంటశాలలో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత, శుభ్రత, మరియు మెనూ వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం ముఖ్యమైన పాత్ర వహిస్తున్నందున, ప్రతి రోజూ నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని సూచించారు. గుడ్లు, కూరగాయలు, పాలు వంటి పోషక పదార్థాలను తప్పక భోజనంలో చేర్చాలని ఆదేశించారు. కలెక్టర్ గుడ్లు వండుతున్నారా? అని ప్రశ్నించినప్పుడు సిబ్బంది, టెండర్ సంస్థ నుండి సరఫరా లభించలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, జిల్లావ్యాప్తంగా ఉన్న యూఆర్ఎస్ మరియు కేజీబీవీఎస్ పాఠశాలల్లో కూడా ఇటువంటి సమస్యలు ఉన్నాయో గుర్తించి, తక్షణమే నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆహార సరఫరాలో ఎటువంటి అంతరాయం రాకుండా నాణ్యతతో కొనసాగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పాఠశాల పరిధిలోని మరుగుదొడ్లు, స్నానగదులు, హాస్టల్ గదులను కలెక్టర్ పరిశీలించారు. కొన్ని సెప్టిక్ ట్యాంకులు బ్లాక్ అయ్యి ఉన్నాయని సిబ్బంది తెలియజేశారు. వీటి మరమ్మతులు సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల ద్వారా వెంటనే చేయాలన్నారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో నిల్వ నీరు ఉన్న ప్రాంతాలను శుభ్రపరచి, దోమల పెరుగుదలను నివారించడానికి సమయానుకూల చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరు, పాఠశాల విద్యార్థుల సంఖ్య, విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ వంటి అంశాలను కలెక్టర్ సవివరంగా తెలుసుకున్నారు. గత సంవత్సరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్లు, ఈ సంవత్సరం కూడా అదే విధంగా పంపిణీ చేయనున్నట్లు అధికారులు వివరించారు. పాఠశాల భవనం విద్యార్థుల సంఖ్యకు తగినంత కాకపోవడం అంశాన్ని సిబ్బంది వెల్లడించారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునేలా చూడటం మన అందరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. అవసరమైతే పాఠశాలను నూతన భవనంలోకి మార్చడం లేదా కొత్త ప్రదేశంలో కొత్త భవనం నిర్మించడం కోసం చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పాఠశాల పరిశుభ్రతను మెరుగుపరచడానికి ఎలక్ట్రికల్ క్లీనింగ్ మెషిన్‌ను అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యానికి, నేర్చుకునే ఉత్సాహానికి దోహదపడుతుందని స్పష్టం చేశారు. పాఠశాల పరిశుభ్రతలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని బలంగా సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సెక్టోరియల్ అధికారి ఏ.నాగరాజ శేఖర్, ఏఈ రాజమౌళి, పాఠశాల ప్రత్యేక అధికారి రాంబాయి, బోధన సిబ్బంది మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


# కిషోర్ బాలికలు విద్య ఆట పాటల్లో చక్కని నైపుణ్యాన్ని కనపరచాలి : సూపర్వైజర్ అనురాధ






**గంట్యాడ, (రాజధాని వార్తలు):** నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా అక్టోబర్ 11 నుండి 18వ తేదీ వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అందులో భాగముగా బుడతనపల్లి జడ్పీ హైస్కూల్లో కిషోర్ బాలికలకు బాల్య వివాహాలు అవగాహన సదస్సు మరియు వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించడమైనది. స్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.వి.వి.యస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పిల్లలు విద్యతో పాటు అన్నీ రంగాల్లో ముందు ఉండాలని అందువలన సృజనాత్మకతను వెలికి తీయాలని తెలిపారు. ఆటపాటలతో అలరించాలని ఖాళీ సమయంలో సమాజానికి మెయిల్ చేసే పుస్తకాలు చదవాలని అందువలన అపారమైన మేధోశక్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు రమేష్ పట్నాయక్, ఫిసికల్ డైరెక్టర్ సూర్యనారాయణ మరియు అంగన్వాడీ కార్యకర్తలు కృష్ణమ్మా, మదీనా, రాజేశ్వరి హాజరయ్యారు.

# అర్జీదారు సమస్యను అర్ధం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్‌రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** అర్జీదారు సమస్యను పూర్తిగా అర్ధం చేసుకోవాలని, వారు చెప్పే విషయాన్ని ఓపిగ్గా వినాలని అప్పుడే వారికి సంతృప్తి కలుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తెలిపారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో పి.జి.ఆర్.ఎస్ వినతులపై కలెక్టర్ సమీక్షించారు. వినతు లపై స్వయంగా సంబంధిత అధికారే ఎండార్స్మెంట్ వేయాలని, క్రింది స్థాయి అధికారులకు అప్పజెప్పకూడదని తెలిపారు. వారి శాఖకు సంబంధం లేని వినతులను సంబంధిత శాఖలకు పంపా లని స్పష్టం చేశారు. అర్జీదారుని శత్రువులా చూడకూడదని, తన అవసరం కోసం మన పై నమ్మకంతొనే వస్తారని, మానవతా దృక్పథంతో అర్జీలను పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో రీ ఓపెన్ అయిన కేసులు 2.83 శాతం ఉన్నాయని, రీ ఓపెన్‌కు గల కారణాలను ఆయా అధికారులకు అడిగారు. ఆడిట్ పెండింగ్ లేకుండా చూడాలని, ప్రతి రోజూ లాగిన్‌లో చూసి పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, సి.పి.ఓ బాలాజీ, డిప్యూటీ కలెక్టర్ మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైయస్సార్సీపి ఆధ్వర్యంలో మద్యంపై నిరసన ర్యాలీ






**భీమిలి, (రాజధాని వార్తలు):** భీమిలి నియోజకవర్గ ఇన్చార్జి, జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆధ్వర్యంలో బ్రాండ్ కల్తీ మద్యం వల్ల ప్రజల ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి భీమిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న వార్డ్ అధ్యక్షులు, మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీలు, నాయకత్వం వహించారు. మహిళా నాయకులు, పార్టీ నేతలు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వ మద్యం విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీ భీమిలి నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభమై, ఎక్సైజ్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం ఎక్సైజ్ అధికారులకు భీమిలి నియోజకవర్గ ఇన్చార్జి,విజయనగరం జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), నియోజకవర్గ పరిధిలో ఉన్న వార్డ్ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మహిళలు నకిలీ ఎన్ బ్రాండ్ మద్యం సీసాలను పగలగొట్టారు కల్తీ మద్యం అరికట్టాలి కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలతో కార్యాలయం పరిసరాలు మార్మోగాయి. కల్తీ మద్యం తయారీ, పంపిణీలో పాలు పంచుకున్న కూటమి ప్రభుత్వ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో చిన్న శ్రీను మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చంద్రబాబు నాయుడు మద్యం బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారని నకిలీ లిక్కర్ వ్యవహారంలో కూడా రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా మార్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, లిక్కర్ సిండికేట్లు, బెల్టు షాపులు, అక్రమ మద్యం తయారీదారుల ద్వారా పెద్ద ఎత్తున అక్రమ సంపాదన జరుగుతోందని, వీటిని టీడీపీ నాయకులే నడిపిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వ మద్యం షాపులను ఉద్దేశపూర్వకంగా తొలగించి, వాటి స్థానంలో టీడీపీ సిండికేట్లకు అనుమతులు ఇచ్చారని, ఇప్పుడు బెల్టు షాపులు, పర్మిట్ రూములు, ఇల్లీగల్ లిక్కర్ వ్యాపారాలు అన్నీ టీడీపీ నాయకుల ఆధీనంలో ఉన్నాయని తెలిపారు కల్తీ మద్యం సీసాలను తమ షాపుల ద్వారా విక్రయించి, దానివల్ల వచ్చిన డబ్బును పంచుకుంటున్నారని ఆరోపించారు. అదే సమయంలో ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం దోచుకుంటున్నారని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఐదు నెలల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా వచ్చిన ఎక్సైజ్ ఆదాయం రూ. 6,782.21 కోట్లు కాగా, 2025-26లో అదే కాలంలో రూ. 6,992.77 కోట్లకే పరిమితమైందని, కేవలం 3.10% వృద్ధి మాత్రమే నమోదు కావడం దీనికి నిదర్శనమని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం ఉత్తరాంధ్ర, గోదా వరి జిల్లాలు, ఇప్పుడు రాయలసీమలో కూడా పెరుగుతున్నాయని, అయితే ప్రజల ప్రాణాలతో ఆడుకోవడం ఏ విధంగానూ సమర్థనీయం కాదని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్న శ్రీను స్పష్టం చేశారు. మద్యం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరగాలనీ, నకిలీ మద్యం వల్ల మరణించిన వారిని గుర్తించి వారి కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించాలనీ కోరారు. వైన్ షాపుల కేటాయింపులో జరిగిన అక్రమాలను గుర్తించి, అనర్హులను తొలగించాలని, మద్యం షాపులను మళ్లీ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిర్వహించాలనీ సూచించారు.అలాగే మద్యం విక్రయ వేళలను తగ్గించి,బడి,గుడి, పబ్లిక్ ప్లేసుల సమీపంలో ఉన్న బార్‌లు,వైన్ షాపులు, లిక్కర్ లైసెన్సులను రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మరియు జిల్లా మరియు నియోజకవర్గం అనుబంధ విభాగాల మహిళా నాయకులు,వార్డ్ అధ్యక్షులు,అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అన్నీ మండలాల పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, డైరెక్టర్లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు మరియు జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# గోమతి నారాయణలో మెడికల్ క్యాంప్ - నారాయణ హెచ్ ఆర్ విభాగం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరంలోని స్థానిక గోమతి నగర్ నందు గల గోమతి నారాయణ సీబీఎస్ఈ స్కూల్లో సోమవారం విద్యార్థులకు, సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల హెచ్ఆర్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో నారాయణ మెడికల్ కళాశాలకు చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఏ నిరంజన్ రెడ్డి, చిన్నపిల్లల దంత వైద్య నిపుణులు డాక్టర్ వంశీ భరత్, డాక్టర్ అనీస్ హాజీరా, కంటి వైద్య నిపుణులు డాక్టర్ శివప్రియ, దంత వైద్య నిపుణులు డాక్టర్ ఏ వి కార్తీక్ తదితరులు పాల్గొని విద్యార్థులకు సిబ్బందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ మస్తానయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన అవసరమన్నారు. నారాయణ విద్యాసంస్థల హెచ్ఆర్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు, సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారికి నారాయణ మెడికల్ కళాశాల మరియు వైద్యశాలలో చికిత్సలు అందజేస్తున్నామన్నారు.

నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఏజీఎం రవి వర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించడమే కాకుండా వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇస్తున్నామన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను వారి తల్లిదండ్రులకు తెలియజేసి అవసర మైన చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ సుధీర్ మాట్లా డుతూ నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఏజీఎం రవి వర్మ సూచనల మేరకు విద్యార్థు లకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ విభాగాలకు చెందిన నిష్ణాతులైన వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని విద్యార్థులకు, అధ్యాపకులకు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందిస్తున్నార న్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆదిశేషయ్య, హెచ్ఆర్ సుభాష్, పిఆర్ఓ నరేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# “సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్” పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వి.ఎస్.యూ) మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో “GST 2.0 Reforms - Super GST Super Savings” అనే అంశంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం విశ్వవిద్యాలయ సివి రామన్ సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ప్రధాన అతిథిగా హాజరై, విద్యార్థులు పన్ను విధానాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ, “జిఎస్టీ 2.0 సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను సమగ్రమైన పారదర్శకత వైపు నడిపించను న్నాయి. ఈ సంస్కరణల ద్వారా వ్యాపార వాతావరణం సులభతరం అవుతుంది. విద్యార్థులు ఇలాంటి ప్రాక్టికల్ చర్చల్లో పాల్గొనడం వల్ల పరిశోధనా దృష్టి మరియు ఫైనాన్స్ అవగాహన పెరుగుతాయి” అన్నారు. విశిష్ట అతిథిగా శ్రీ కిరణ్ గారు, వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ మాట్లాడుతూ, “GST 2.0 Reforms వాణిజ్య రంగంలో కొత్త అవకాశాలను తెరుస్తాయి. పన్ను చెల్లింపులు, రిఫండ్‌లు, మరియు అకౌంటింగ్ వ్యవస్థలో పూర్తిస్థాయి డిజిటలైజేషన్ ద్వారా సులభతరం, పారదర్శకత, మరియు వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యం,” అని వివరించారు. అలాగే “Super GST Super Savings” సూత్రం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు వ్యాపారులకు కూడా ప్రోత్సాహం కల్పించడమే ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

గౌరవనీయ అతిథి డాక్టర్ కె.సునీత, రిజిస్ట్రార్, వి.ఎస్. యూ కళాశాల, నెల్లూరు మాట్లాడుతూ, “వాణిజ్య పన్నుల శాఖ మరియు విశ్వవిద్యాలయం సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆర్థిక మరియు వ్యాపార పన్నులపై అవగాహన పెంపొందించడానికి దోహదపడుతుంది,” అని అన్నారు. ఆచార్య సిహెచ్ విజయ, ప్రిన్సిపల్, వి.ఎస్.యూ కళాశాల, నెల్లూరు మరియు ఆచార్య సిహెచ్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, వి.ఎస్.యూ కళాశాల కావలి, డాక్టర్ సాయి శ్రవంతి, వాణిజ్య పన్నుల శాఖ అధికారుల బృందం సిహెచ్ గోపీచంద్ Asst Commissioner No2 Nellore, ఎస్ కె. గౌసేపీరా Asst Commissioner No3 Nellore, జి వి సునీల్ ఎ ఈ ఓ, నిష్కుమార్ జి ఎస్ టి ఓ, అనిల్ కుమార్ జి ఎస్ టి ఓ, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారుల బృందం “GST Portal and New Filing System” పై ప్రదర్శన ఇచ్చి, కొత్త పన్ను రిటర్న్ ప్రక్రియలను వివరిస్తూ ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ కూడా నిర్వహించారు.

# అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్య ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

**- నిర్దిష్ట గడువులోగా సమస్యలను పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కలెక్టరేట్‌నందు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, డిపివో శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు స్వాగతం పలికిన ఎంపీ వేమిరెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారత ప్రధాని నరేంద్ర మోడీని, అలాగే కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడుకి, ఐటీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్‌కి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. సోమవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్‌లో సీఎంని, లోకేష్‌ని కలిసి వారికి ఆహ్వానం పలికారు. రాష్ట్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు గూగుల్ అనుబంధ సంస్థ రైడన్ ద్వారా విశాఖలో రూ. 84 వేల కోట్లతో ఏర్పాటు కానున్న డేటా సెంటర్ పై ప్రధాని నరేంద్ర మోడీతో సీఎం చంద్రబాబు చర్చించనున్నారు.

# మహిళల రక్షణ కొరకు శక్తి యాప్




**విజయనగరం, (రాజధాని వార్తలు):** నేడు జిల్లా కోర్టు పరిధిలో ఉన్న అన్ని కోర్టులలో ఉన్న మహిళా సిబ్బందికి వారి యొక్క రక్షణ కొరకు భద్రత కొరకు న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు ఎం.భబిత ముఖ్యఅతిథిగా హాజరు అయినారు. ఈ కార్యక్రమంలో వారు అన్ని కోర్టులలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శక్తి ఆప్ ను వారి యొక్క మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ తప్పనిసరిగా చేసుకోవాలని, ఈ యాప్ ద్వారా మహిళలు ఎక్కడ ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అత్యవసర రక్షణ లేదా సహాయము కావలసిన ఎడల ఈ యాప్ వినియోగించి వారికి పోలీస్ శాఖ ద్వారా రక్షణ త్వరితగతిన అందుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్క మహిళ శక్తి యాప్ ను వారి యొక్క మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని వినియోగించాలని తెలియజేశారు. విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కే.నరసింహమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శిరీష కోర్టు సిబ్బందికి శక్తి యాప్‌ను ఏ విధంగా డౌన్లోడ్ చేసుకోవాలో మరియు దాన్ని ఏ విధంగా ఉపయోగించాలో తర్ఫీదునిచ్చారు. మహిళల రక్షణ కొరకు శక్తి యాప్‌ను ఈ క్రింది విధంగా డౌన్లోడ్ చేసుకోవాలి ముందుగా మొబైల్ ఫోన్లో ఉన్న ప్లే స్టోర్‌లోకి వెళ్లి శక్తి యాప్ అని టైప్ చేస్తే యాప్ డౌన్లోడ్ అవుతుంది. తర్వాత మీ ఫోన్ నెంబర్ ఎంటర్ చేస్తే ఓటిపి వస్తుంది అది ఎంటర్ చేసిన తరువాత వ్యక్తిగత వివరాలు నమోదు చేసుకోవాలి. అదేవిధంగా బాల బాలికలు మిస్సింగ్ అయినా ఈ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చు. మిస్సయిన బాలబాలికను గుర్తించడానికి యాప్ ఉపయోగపడుతుందని తెలియజేశారు.

# చికిత్స పొందుతున్న మున్వర్‌ని పరామర్శించిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు అపోలో హాస్పిటల్లో గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్ఆర్సిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మున్వర్ మరియు వారి అల్లుడును వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ సిబ్బందిని చంద్రశేఖర్ రెడ్డి కోరారు. అనంతరం మున్వర్ కుటుంబ సభ్యులతో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

## RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని ఖండిస్తూ రాస్తారోకో





**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ బోని సన్నబాబు ఆధ్వర్యంలో తాళ్లవలస అంబేద్కర్ కూడలి వద్ద రాస్తారకో నిర్వహించారు ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు బోని సన్నిబాబు సియ్యాద్రి రాం బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భాగం గోపాలరావు మాట్లాడుతూ భారత దేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిపై దాడిని దేశ సార్వభౌమాధికారం పై దాడిగా అభివర్ణిం చారు ప్రధాన న్యాయమూర్తి దళితుడైనందున సనాతన ధర్మం పేరుతో కిషోర్ అనే న్యాయవాది బూటు తో దాడి చేశారని అదే స్థానంలో ఓసి న్యాయమూర్తి ఉంటే దాడి చేయగలరా అని ప్రశ్నిం చారు? దాడి చేసిన న్యాయవాదిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రయోగించి అరెస్టు చేయాలని అలాగే అతని సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరియు తెలుగు రాష్ట్రానికి సంబంధించిన హర్యానా క్యాడర్ అడిషనల్ డీజీపీ పురాన్ కుమార్ పై అవినీతి ఆరోపణలతో కుట్ర చేసి ఇరికించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన పోలీస్ ఉన్నతాధికారులపై చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు అలాగే ఒక అడిషనల్ డిజిపి స్థాయి అధికారి మరణిస్తే అతనికంటే చిన్న కేడర్ అయిన ఐజి స్థాయి అధికారితో సిట్ వేయడం ఎంతవరకు న్యాయమని ఎద్దేవా చేశారు పై రెండు సంఘటనలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని సనాతన ధర్మం పేరుతో దళితులపై జరుగుతున్న దాడులను ఆపాలని దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో దళిత నాయకులు బోని ప్రసాద్ బెల్లన అప్పారావు బోని నర్సింగరావు యాగాటి రామారావు మామిడి భాస్కరరావు బోని శివ మట్ట ఆదినారాయణ లంక పైడ్రాజు బోనీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం అరికట్టాలని ధర్నా

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గ ఇంచార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో వైస్సార్సీపీ పార్టీ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దొర బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నారా వారి కల్తీ మద్యం తయారీ ఒక కుటీర పరిశ్రమలా ఏర్పడి రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ కాలు కొనసాగిస్తూ ప్రభుత్వ ఖాజానకు నష్టంతో పాటుగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడివారి ప్రాణాలు కోల్పోవడానికి కారణం అయ్యిందన్నారు. తప్పుడు ప్రచారంతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని ప్రజల్లో వారు అలజడి సృష్టించారన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం అరికట్టాలని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కంటి సాయి ప్రసాద్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఆవాల లక్ష్మి నారాయణ, నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు సేపేని రూప, సామర్లకోట పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, నియోజక వర్గ పరిధి లోని వైసీపి సర్పంచిలు, ఎంపిటిసిలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈజీగా డబ్బులు వస్తాయంటే నమ్మి మోసపోవద్దు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఉచితంగా డబ్బులు సంపాదించే ఐడియా ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇస్తామని చెప్పే ఫోన్ కాల్స్‌ను ప్రజలు నమ్మి మోసపోవద్దని, సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డి ఎస్పీ డి శ్రీహరి రాజు సూచించారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ ఈ మధ్య కాలంలో సైబర్ నేరగాళ్ళ మోసాలు బాగా పెరిగి పోయాయాన్నారు. ఏవో అజ్ఞాత లాభాల మాటలకు లోనై నష్టపోవద్దని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండి మోసాల నుండి రక్షించుకోవా లన్నారు. ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేశాక, వారి పేరుతో ఒక యూసర్ ఐడితో ట్రేడింగ్ అకౌంట్ తయారు చేసి, ఆ తరువాత కూడా సైబర్ మోసగా ళ్లు నిరంతరం ఫోన్ ద్వారా సంప్రదిస్తూ, పెద్ద మొత్తాల లావాదేవీలు చేయమని ప్రలోభపెడతాడ తారన్నారు. తెలియని వ్యక్తులు లేదా సంస్థల పేరుతో ఫోన్ కాల్స్, సోషల్ మీడియా, లేదా ట్రేడింగ్ యాప్ల ద్వారా ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పి డబ్బులు మోసం చేసే ఘటనలు తరచుగా చోటు చేసుకుంటున్నాయన్నారు. "తక్కువ పెట్టుబ డికి ఎక్కువ లాభం" అంటూ ఆకర్షించే మాటలు చెప్పే వారిని నమ్మి మోసపోవద్దన్నారు. బ్యాంక్ వివరాలు, ఓటీపీ యూపీఐ పిన్, వంటి వివరాలు ఎవరికీ ఇవ్వకూడదన్నారు. అలాంటి మోసపూరిత ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీస్ స్టేషన్లలో




ఫిర్యాదు చేస్తే ప్రజల ఖాతాలోని సొమ్ము సైబర్ నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లకుండా రక్షణ కల్పించడం జరుగు తుందన్నారు. ఈ విషయాలను ప్రజలు గమనించి సైబర్ నేరగాల నుంచి బయటపడాలని డీఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు.

# పంచారామంలో సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి కుటుంబం పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీకుమారా రామ భీమేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి జస్టిస్ సుప్రీం కోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్ వి రమణ కుటుంబం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన జస్టిస్ కుటుంబానికి ఆలయ చైర్మెన్ కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ దంపతులు తొలుత ధ్వజస్తంభం వద్దవున్న శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భీమేశ్వర స్వామికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం జస్టిస్ కుటుంబానికి నంది మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు సన్నిదిరాజు వెంకట రమణ, చెరుకూరి సుందర రామయ్య, సత్యనారాయణలు పండిత ఆశీర్వచనం అందించారు. ఈ సందర్బంగా ఆలయ చైర్మెన్ జస్టిస్ దంపతులను సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదములు, స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈ సందర్బంగా జస్టిస్ కుటుంబం వెంట తూర్పుగోదావరి జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ సునీత గంధం, కాకినాడ జిల్లా నాల్గవ జూనియర్ జడ్జ్ నిరుప భాంజ్, ఇతర కోర్ట్ సిబ్బంది, సామర్లకోట పోలీస్, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan